జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 12 సంచిక 265 విశాఖపట్నం | శుక్రవారం 11 జూన్ 2021 | 8 పేజీలు | వెల : 5.00

## కేంద్ర జలశక్తి మంత్రి షెకావత్‌తో జగన్ భేటీ





న్యూ ఢిల్లీ, జూన్ 10, ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్‌తో భేటీ అయ్యారు. అనంతరం కేంద్ర జలశక్తి మంత్రి షెకావత్‌తో సీఎం జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్ పనుల పురోగతిని సీఎం జగన్ వివరించారు. పోలవరం ప్రాజెక్ట్ బకాయిల అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. షెకావత్‌తో సీఎం జగన్ సమావేశం దాదాపు 40 నిమిషాల పాటు కొనసాగింది.

### ఏపీ అభివృద్ధి పథంలో నడుస్తోంది: నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ రాజీవ్‌కుమార్ ప్రశంసలు కురిపించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం జగన్.. గురువారం సాయంత్రం రాజీవ్ కుమార్‌తో సమావేశ మయ్యారు. గంటకుపైగా కొనసాగిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. పోలవరం ప్రాజెక్ట్, పేదలకు ఇళ్ల నిర్మాణాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర నిధులు, సహకారంపై సీఎం జగన్ చర్చించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ పాలనలోని ఏపీ అభివృద్ధిని రాజీవ్ కుమార్ కొనియాడుతూ ట్వీట్ చేశారు. 'పలు రంగాల్లో ఏపీ అభివృద్ధి పథంలో నడుస్తోంది. 2020-21 సుస్థిర అభివృద్ధి రాష్ట్రాల్లో ఏపీ మూడో స్థానంలో ఉంది. ఏపీ వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవశ్యకతను సీఎం జగన్ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, లక్ష్యాలను సీఎం జగన్ వివరించారు' అని ట్వీట్ చేశారు.

## ముంబైలో భవనం కూలి 11 మంది దుర్మరణం




ముంబై,జూన్ 10, ప్రజాపాలన ప్రతినిధి:మహారాష్ట్రలోని ముంబైలో విషాదం చోటు చేసుకున్నది. మలాడ్ వెస్ట్ ప్రాంతంలోని న్యూకలెక్టర్ కాంపౌండ్‌లో బుధవారం రాత్రి ఓ నివాస భవనం కూలిపోయింది. ఘటనలో 11 మంది మృతి చెందారు. మరో మంది ఎనిమిది గాయపడగా.. వారిని దవాఖానాకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వెంటనే సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మహిళలు, పిల్లలు సహా మరో 15 మందిని రక్షించి ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సమీపంలో ఉన్న రెండు భవనాలు సైతం సరైన స్థితిలో లేనందున వాటిలో ఉంటున్న వారిని సైతం ఖాళీ చేయించి కూల్చివేసినట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు.ప్రస్తుతం ఇంకా శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఘటనపై రాష్ట్ర మంత్రి అస్లాం షేక్ మాట్లాడుతూ భారీగా కురిసిన వర్షం కారణంగా భవనం కూలిపోయిందని తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, గాయపడిన వారిని హాస్పిటల్‌లో చేర్పించారన్నారు. శిథిలాల కింద ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా? లేదా? తెలుసుకునేందుకు శిథిలాల తొలగింపు పనులు జరుగుతున్నాయన్నారు.



### సీఎం ఢిల్లీ పర్యటనపై ఎల్లో మీడియా రాద్ధాంతం చేస్తోంది: బొత్స

అమరావతి,జూన్ 10, ప్రజాపాలన ప్రతినిధి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన నేపథ్యంలో టీడీపీ, ఎల్లో మీడియా రాద్ధాంతం చేస్తున్నాయని మంత్రి బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " టీడీపీకి నీచమైన ఆలోచనలు తప్ప.. సూచనలు ఇచ్చే అలవాటు లేదు. కరోనా కట్టడికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశాం" అని తెలిపారు.

### ఈ ఏడాది రూ.8,600 కోట్లతో ధాన్యం కొనుగోళ్లు: కోన శశిధర్



అమరావతి,జూన్ 10, ప్రజాపాలన ప్రతినిధి:ఈ ఏడాది రూ.8,600 కోట్లతో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ కోన శశిధర్ తెలిపారు. గతం కంటే ఎక్కువ ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 25 లక్షల 25 వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు చేయగా ఎప్పుడూ లేని విధంగా కడప, కర్నూల్‌లో అధికంగా కొనుగోళ్లు చేసినట్లు తెలిపారు.ఇక రైతులు, దళారుల చేతిలో మోసపోకుండా నేరుగా కొంటున్నామని, ఈ క్రమంలో రైతుల పొలాలకు వెళ్లి ధాన్యం కోనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌బీకేల్లో రైతులకు రిజిస్ట్రేషన్, కొనుగోలు కూపన్లు ఇవ్వడం ద్వారా రైతులకు పేమెంట్ ఆలస్యం లేకుండా చేస్తున్నామని వెల్లడించారు. కేంద్రం నుంచి రూ.3,900 కోట్లు రావాల్సి ఉండగా, కేంద్రం ఏటా ఇచ్చే అడ్వాన్స్ కూడా ఇవ్వలేదని అయినా పెండింగ్‌లో ఉన్న రూ.300 కోట్లు విడుదల చేస్తున్నామన్నారు. జులై నెలాఖరు వరకు ధాన్యం సేకరణ చేస్తామని అన్నారు.

## 50 కోట్ల ఫైజర్ వ్యాక్సిన్లు కొని ప్రపంచ దేశాలకు ఇవ్వనున్న అమెరికా!



వాషింగ్టన్,జూన్ 10, ప్రజాపాలన ప్రతినిధి: ప్రపంచ దేశాల కోసం అమెరికాలోని జో బైడెన్ ప్రభుత్వం 50 కోట్ల ఫైజర్-బయోఎన్‌టెక్ కరోనా వ్యాక్సిన్లను కొనుగోలు చేయనున్నట్లు అక్కడి మీడియా బుధవారం వెల్లడించింది. దీనికి సంబంధించి జీ7 సమావేశంలో బైడెన్ అధికారిక ప్రకటన చేయనున్నట్లు వాషింగ్టన్ పోస్ట్, న్యూయార్క్ టైమ్స్ పత్రికలు తెలిపాయి. ధనిక దేశాలే మెజార్టీ వ్యాక్సిన్లను కొనుగోలు చేశాయన్న ఆరోపణల నేపథ్యంలో అగ్రరాజ్యం అమెరికా కూడా తీవ్రంగా విమర్శలు ఎదుర్కొంటోంది.అమెరికా ఇప్పటికే తన సగానికి పైగా జనాభాకు వ్యాక్సిన్లు వేసేసింది. అక్కడి కరోనా కేసులు కూడా భారీగా తగ్గాయి. బ్రిటన్‌కు వెళ్లడానికి ఎయిర్‌ఫోర్స్ వన్ ఎక్కే ముందే దీనిపై ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు బైడెన్ హింట్ ఇచ్చారు. ప్రపంచం కోసం వ్యాక్సిన్ వ్యూహం ఏమైనా ఉందా అని ప్రశ్నించగా.. నా దగ్గర ఒక వ్యూహం ఉంది. త్వరలోనే ప్రకటిస్తాను అని ఆయన అన్నారు. ఈ ప్రకటన చేసే సమయంలో బైడెన్‌తోపాటు ఫైజర్ సీఈవో ఆల్బర్ట్ బౌర్లా కూడా ఉండే అవకాశం ఉంది. ఈ వ్యాక్సిన్ల కోసం లాభాలు లేని ధరను ఫైజర్‌కు అమెరికా చెల్లించనుంది. వీటిలో 20 కోట్లను ఈ ఏడాది, 30 కోట్లను వచ్చే ఏడాది ప్రపంచ దేశాలకు పంపిణీ చేయనుంది.




### కరోనా పరీక్షలు మరింత వేగవంతం చేయాలి: హైకోర్టు

అమరావతి: కరోనా నిర్ధారణ పరీక్షలను మరింత వేగవంతం చేయాలని, ఎక్కువ పరీక్షలు చేయాలని ఏపీ హైకోర్టు ఆదేశించింది. కాంట్రాక్ట నర్సులకు నెలల తరబడి బకాయి ఉన్న వేతనాలను చెల్లించాలని స్పష్టం చేసింది. రెమిడెసివర్ ఇంజెక్షన్ల వినియోగ కాలపరిమితిని ఏడాదికి పెంచుతూ డీసీఐ ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. కరోనా వేళ మానసిక రోగులకు ఎలాంటి వైద్యచికిత్సలు అందిస్తున్నారని న్యాయస్థానం ఆరా తీసింది. మెంటల్ హెల్త్ యాక్టును ఏ విధంగా అమలు చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. (మిగతా 2లో..)

## రఘురామకృష్ణరాజు టీడీపీ ఏజెంట్‌గా మారారు:అనిల్



విజయవాడ,జూన్ 10, ప్రజాపాలన ప్రతినిధి: ఎంపీ రఘురామకృష్ణరాజు టీడీపీకి ఏజెంట్‌గా మారారు అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ విషయంలో టీడీపీ చేసిన తప్పులను తాము చేయమని స్పష్టం చేశారు. అలానే లోకేశ్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు మంత్రి అనిల్.ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ.. "పోలవరం ప్రాజెక్ట్‌ను అడ్డుకోవాలని టీడీపీ కుట్ర చేస్తోంది. రైతుల కళ్లలో ఆనందాన్ని టీడీపీ చూడలేకపోతోంది. ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ పోలవరం పనులు కొనసాగుతున్నాయి ఎదో ఒక రకంగా దాన్ని ఇబ్బంది పెట్టాలని టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అది పూర్తి అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌కి మంచి పేరు వస్తుందని వారి భయం. అందుకే రఘురామకృష్ణంరాజు లాంటి వాళ్ళతో అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు" అని మంత్రి అనిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "చినబాబు ఫ్రస్టేషన్ పీక్స్‌కి వెళుతోంది. మూడు శాఖలకు మంత్రిగా చేసినా ఎమ్మెల్యేగా గెలవలేకపోయాడు. ఉన్న ఎమ్మెల్సీ కూడా ఓ ఏడాదిలో పూర్తి అయిపోతుంది. అందుకే బయట తిరగలేక ఇంట్లో కూర్చుని జూమ్‌లో సీఎం జగన్ గురించి మాట్లాడుతున్నాడు.. కానీ వైఎస్ జగన్ గురించి మాట్లాడే అర్హత నీకు ఒక్క శాతమైనా ఉందా. మా తాత సీఎం, మా నాన్న సీఎం అని చెప్పుకున్నా నువ్వు గెలవలేక పోయావ్. కనుచూపు మేరలో నీ పార్టీ జగన్ సంక్షేమ పథకాలతో కొట్టుకుపోయే పరిస్థితి. జగన్ అముల్ బేబీ అయితే.. నువ్వు హెరిటేజ్ దున్నపోతువా. మాటలు నీకే కాదు...మాకు వచ్చు" అని మంత్రి అనిల్, లోకేశ్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమేత్తారు."గూగుల్‌లో కొడితే నీ పేరు పప్పు అని వచ్చింది. (మిగతా 2లో..)



# పోషకాహారం, వ్యాయామంతో కరోనాను ఎదుర్కొందాం

కరోనాను ఎదుర్కొనడంలో అత్యంత కీలకమైన వాటిలో రోగనిరోధక శక్తి కీలకమైనది. మాస్కు ధరించడం, భౌతికదూరం పాటించడం, శానిటైజర్ లేదా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవడం ఎంత ముఖ్యమో.. మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడం కూడా అంతే ముఖ్యం. ఎందుకంటే మనలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటే కరోనా వైరస్ వచ్చినా సులువుగా ఎదుర్కొనగలం. రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి అనేక మార్గాలున్నాయి. మంచి పోషకాహారం తీసుకోవడంతోపాటు తప్పనిసరిగా వ్యాయామాలు చేయడం మంచిది. కరోనా వంటి జబ్బుల నుంచి రక్షణ పొందాలంటే ఇమ్యూనిటీ చాలా అవసరం. అందుకు డైట్‌తో పాటు వ్యాయామాలు కూడా చేయాలి. కరోనా వైరస్ నేపథ్యంలో మన ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పౌష్టికారం తీసుకోవడంతో పాటు పరిశుభ్రంగా ఉండాలి. ముఖ్యంగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ముఖాన్ని పదే పదే చేతులతో తాకకూడదు. అలా చేస్తే కరోనా వైరస్ మీ శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. రోగనిరోధక శక్తిని పెంచుకునేందుకు ప్రయత్నించాలి. రోగనిరోధక శక్తి ప్రతి ఒక్కరికీ చాలా అవసరం. విటమిన్లు, పోషకాలు ఎక్కువగా లభించే కూరగాయాలు తినాలి. అప్పుడే నూతన ఉత్సాహంతో పనులు చేసుకోవచ్చుమనం తీసుకునే ఆహారంలో ప్రతిరోజూ కనీసం ఒక గుడ్డు ఉండేలా చూసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఉడకబెట్టిన గుడ్డు తింటే శారీరకంగా బలం చేకూరి రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. కరోనా వైరస్ బాధితులకు సైతం వైద్యులు గుడ్లు అందిస్తున్నారు. తాజా ఆకుకూరలు తింటే కంటిచూపు మెరుగ్గా ఉంటుందంటారు. అయితే ఆకుకూరల్లో విటమిన్లు ఎ, సి, కె లభిస్తాయి. వీటితో పాటు కాల్షియం, మెగ్నీషియం శరీరానికి అందితే నూతన ఉత్సాహంగా కనిపిస్తారు. కరోనా సమయంలో ఉద్యోగాలు చేసేవారు వర్క్ హోం కారణంగా రోజంతా ఇంట్లోనే ఉంటూ పనిచేయాల్సి వస్తోంది. ఈ కారణంగా అనారోగ్య సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. కాబట్టి వ్యాయామం, యోగా, ఎక్సర్‌సైజ్ లాంటి శారీరక శ్రమ చేయాలి. తద్వారా శరీరాన్ని ఉత్సాహంగా ఉంచుకోవడంతో పాటు రోగనిరోధకశక్తిని పెంచుకోవచ్చు. మంచి నీరు కూడా ఎక్కువగా తాగాలి. తక్కువగా నీరు తీసుకుంటే డీహైడ్రేట్ అవుతారు. లేక తలనొప్పి లాంటి సమస్యలు వస్తాయి.

**మాస్కు, శానిటైజర్, భౌతికదూరం కొనసాగించాలి**

ముఖ్యంగా కరోనా వైరస్ కు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో ఎలాంటి మందులు లేవు. ప్రస్తుతం వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతున్నా.. అది పూర్తవడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ వైరస్ వ్యాప్తి జరగకుండా బయటకు వెళ్తున్నపుడు మాస్కు ధరించడం, శానిటైజర్ వెంట తీసుకెళ్లడం, ఎదుటివారితో మాట్లాడేటప్పుడు భౌతిక దూరం పాటించడం అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. చేతులను తరచూ సబ్బు నీటితో శుభ్రం చేసుకోవడం మన దైనందిన కార్యక్రమాల్లో భాగం చేసుకోవాలి.

**వ్యాయామం లేదా యోగా**

ప్రతిరోజూ ఉదయం యోగా లేక వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలి. ఒత్తిడి తగ్గాలి అంటే వ్యాయామం, వాకింగ్, రన్నింగ్ తప్పక చెయ్యాలి. కనీసం రోజుకు 45నిమిషాల పాటు ఈ వ్యాయామాలు చెయ్యడం వల్ల ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా ఉండడానికి సహాయ పడుతుంది.

**ఆహారపు అలవాట్లు మారాలి**

కరోనా వైరస్ కు ముందు మన ఆహారపు అలవాట్లకు ఇప్పటికీ చాలా తేడా వచ్చి ఉంటుంది. దీన్ని భవిష్యత్తులోనూ కొనసాగించాలి. ముఖ్యంగా వేడివేడి పదార్థాలనే తినడం అలవాటు చేసుకోవాలి. ఫ్రిజ్ లో పెట్టి రెండు మూడు రోజులపాటు తినే అలవాటును మానేయాలి. కేవలం రుచికోసమే కాకుండా మన ఆరోగ్యం గురించి కూడా ఆలోచించి అన్నిరకాల ఆహారపదార్థాలు తినడం అలవాటు చేసుకోవాలి. జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్ వంటివాటికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి. తాజా కూరగాయలు, పండ్లు, మొలకెత్తిన గింజలు, డ్రైఫ్రూట్స్ వంటివి తీసుకుంటూ ఉండాలి. నిజానికి జంక్ ఫుడ్ తో పోలిస్తే వీటికి అయ్యే ఖర్చు తక్కువే. ఫ్రిజ్ లో పెట్టి చల్లని నీళ్లు తాగడం మానేసి గోరువెచ్చని నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి.

**వ్యాయామం తప్పనిసరి**

మన శరీరంలో తగినంత రోగనిరోధక శక్తి ఉంటే వైరస్ లు, బ్యాక్టీరియాల వల్ల వచ్చే వ్యాధులను సులభంగా ఎదుర్కొనవచ్చు. అదే మనశరీరం ధృడంగా లేకపోతే ఎన్నిజాగ్రత్తలు తీసుకున్నా ఉపయోగం ఉండదు. రోగ నిరోధకశక్తి కోసం కోసం మంచి ఆహారం తీసుకుంటే సరిపోదు. తీసుకున్న ఆహారాన్ని శరీరంలోని ప్రతి వ్యవస్థ బలంగా మారేలా వ్యాయామాలు చేయాలి. ఇప్పటిదాకా వ్యాయామాలు చేయడం అలవాటు లేకపోతే ఇక నుంచయినా మొదలుపెట్టాలి. వ్యాయామం అనేది రోజువారీ



కార్యక్రమాల్లో భాగంగా చేసుకోవాలి. యోగ, ధ్యానం, ప్రాణాయామం వంటివి కూడా చేయాలి.

**వ్యక్తిగత పరిశుభ్రతా ముఖ్యమే**

కరోనా సమయంలోనే కాకుండా రాబోయే రోజుల్లో కూడా వ్యక్తిగత పరిశుభ్రత అనేది అవసరమే. అత్యవసరమైన పనులున్నాయని, సమయం లేదని స్నానం చెయ్యకుండా ఉండొద్దు. తరచూ కాళ్లు, చేతులు కడుక్కోవడం అనేది ఎప్పుడూ కొనసాగించాలి. ఇంట్లోకి అడుగుపెట్టకముందే కాళ్లు, చేతులు, ముఖం శుభ్రంగా కడుక్కోవాలి. అంతేగానీ అలసిపోయి వచ్చామంటూ సోఫాలో అలాగే సాగిలపడొద్దు. వీలైతే ఆఫీస్ నుంచి వచ్చాక కూడా వేడివేడి నీళ్లతో స్నానం చేయాలి. అంతేకాకుండా తరచూ చేతులతో ముఖాన్ని, శరీర భాగాలను తాకే అలవాటు మానుకోవాలి.

**పిల్లలు, పెద్దలపట్ల జాగ్రత్తగా ఉండాలి**

పిల్లలు, పెద్దల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా అస్సలు ఉండొద్దు. ప్రస్తుత పరిస్థితుల్లో 'జ్వరం, జలుబు, దగ్గు అవేవి మామూలు రోగాలే అని నిర్లక్ష్యంగా ఉండొద్దు. అదే తగ్గిపోతుందనుకోవద్దు. అలాగని మెడికల్ షాపు నుంచి ఏదిపడితే అది తెచ్చి వేయకండి. ఎందుకంటే పిల్లలు, వృద్ధుల్లో ఇమ్యూనిటీ తక్కువగా ఉంటుందనే విషయాన్ని గుర్తించాలి. పిల్లలను శుభ్రంగా ఉంచడంతోపాటు వాళ్లకు మంచి పోషకాహారం ఇవ్వాలి. ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చినట్టయితే వైద్యులను సంప్రదించాలి.

**అత్యవసరం అయితేనే బయటివారిని కలవాలి**

కరోనా సమయంలో అవుట్ డోర్ మీటింగ్స్ సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలి. అత్యవసరమైతేనే వెళ్లాలి. వీలైనంత వరకు ఫోన్, ఆన్లైన్ చాటింగ్ ద్వారా పూర్తయ్యేలా చేసుకోవాలి.

**డాక్టర్ అర్జా శ్రీకాంత్**
**ఎపి స్టేట్ నోడల్ ఆఫీసర్,**
**కోవిడ్–19**





## లిజగనన్న తోడు పథకం చిరువ్యాపారుల జీవితాల్లో వెలుగు:ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

జగ్గయ్యపేటజూన్10ప్రజాపాలన:జగనన్న తోడు ప థకం చిరువ్యాపారుల జీవితాల్లో వెలుగు నింపిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సా మినేని ఉదయభాను అన్నారు. గురువారం పట్టణం లోని మున్సిపల్ కార్యాలయంలో జగనన్న తోడు ప థకం ద్వారా జగ్గయ్యపేట పట్టణంలో 400 మంది చి రు వ్యాపారులకు రూ. 10 వేల చొప్పున మంజూరైన రూ. 40 లక్షల రూపాయల వడ్డీలేని రుణాలను లబ్ధి దారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులను ఆదుకో వడమే లక్ష్యంగా పుట్‌పాత్‌లు, వీధుల్లో తోపుడు బం డ్లు, గంపలు, బుట్టల్లో కూరగాయలు, పండ్లు తదితర వృత్తులపై ఆధారపడి జీవించేవారికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు కింద సున్నా వడ్డీకే రుణాలు అందజే స్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మో హన్ రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో చిరు వ్యాపారుల క ష్టాలను చూసి చలించి వారిని ఆదుకోవడం కోసం జ గనన్న తోడు పథకం అమలుకు శ్రీకారం చుట్టారని తె లిపారు. దీని ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ బ్యాంకు ల ద్వారా రుణం ఇప్పించి రుణంపై అయ్యే వడ్డీ మొ త్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తోందని తె లిపారు. అనంతరం జగనన్న తోడు గుర్తింపు కా ర్డు లను లబ్ధిదారులకు అందజేశారు.

## మున్సిపల్, అధికారికి కార్మికులు సమ్మె నోటీసు



నందిగామజూన్10ప్రజాపాలన:రాష్ట్రవ్యాప్తంగా పి లుపులో భాగంగా జూన్ 14 .15 తేదీల్లో సమ్మెలో తె లియజేయుటకు నందిగామ మున్సిపల్ ఆఫీస్ లో మున్సిపల్, అధికారికి కార్మికులు సమ్మె నోటీసు అం దజేయడం జరిగినది. కరోనా కట్టడికి రక్షణ పరికరాలు హెల్త్ జీతాలు బకాయిలు సిబ్బంది పెంపు పర్మినెంట్ చేయాలని ఇతర సమస్యల పరిష్కారం కోసం జూన్ నాలుగో తేదీ తర్వాత ఏ రోజు నైనా జరిగే రాష్ట్ర వ్యా ప్త సమ్మెలో నందిగామ మున్సిపాల్టీలో కార్మికులు ఇం జనీరింగ్ విభాగం కార్మికులు అందరూ ఈ సమ్మెలో పాల్గొటున్నామని తెలియజేశారుకరోనా మహమ్మారి నుండి పారిశుధ్యం ఇంజనీరింగ్ కార్మికుల ప్రాణాలు కాపాడేందుకు నాణ్యమైన పరికరాలు అందించాలని మెరుగైన వైద్యం మరియు 50 లక్షల రూపాయల బీ మా చెల్లించాలనిజీతాలు వెంటనే చెల్లించాలని విస్త రణ మేరకు సిబ్బంది సంఖ్య పెంచాలని నాలుగు సం వత్సరాలు పనిచేసిన కార్మికులుగా గుర్తించాలనిఆ ప్కాస్ నుండి మినహాయించే కార్మికులందరినీ పర్మి నెంట్ చేయాలనిపీఎఫ్ ఈఎస్ఐ బకాయిలు వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలనిరిటైర్మెంట్ బెనిఫి ట్స్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంపు .సమాన పనికి సమాన వేతనం. పదకొండవ పిఆర్సి మున్సి ప ల్ కార్మికులు అందరికీ వర్తింపజేయాలనిఏపీ మున్సి పల్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేస్తుందిఈ కార్యక్రమంలో సిఐటియ కే గోపాల్ కార్మికులు ప్రసా దు రామారావు యలమందయ్య పాల్గొన్నారు.

## అక్రమ మద్యం దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు:చందోలు ఎస్ఐ శివయ్య



ప్రజాపాలన – పిట్టలవానిపాలెం : మండల పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం దుకాణాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని చందోలు ఎస్ఐ శివయ్య హెచ్చరించారు. గురువారం స్థానిక చందోలు పోలీస్ స్టేషన్లో అయన ప్రజాపాలన ప్రతినిధితో మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందికరంగా గృహాల వద్ద ఎవరైనా అక్రమ మద్యం దుకాణాలు నిర్వహిస్తే ప్రజలు పోలీసు వారికి సమాచారం అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలని, నిభందనలు అతిక్రమించరాదని చెప్పారు. పిట్టలవాని పాలెం మండల పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం దుకాణాలు నిర్వహించి అక్రమ మద్యం విక్రయాలు జరిపిన, రవాణా చేసిన వారి పై నాన్ బెయిబుల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.




ప్రజాపాలన
సంపాదకీయం
శుక్రవారం 11, జూన్ 2021

# విలువల తోడు ఉంటే వెన్నెముక ఉన్నట్టే!

ధర్మాన్ని మనం రక్షిస్తే, ధర్మం మనల్ని రక్షిస్తుందని, చెట్టును బతికిస్తే అది మనల్ని బతికిస్తుందని చెబుతుంటారు కదా, అట్లాగే, విలువలను మనం కాపాడితే, అవి తిరిగి మనలను కాపాడతాయి. ఒక సమాజం నిలకడైన, నికార్సైన పోరాటం చేసి సాధించుకున్న విజయాలు, సమకూర్చుకున్న విలువలు ఆ, సమాజాన్ని ఎంతగా రక్షిస్తాయో తమిళనాడును చూస్తే అర్థం అవుతుంది. ద్రావిడ ఉద్యమం కాలక్రమంలో పతనం కాలేదని కాదు, వెలిసిపోలేదని, లొంగిపోలేదని కూడా కాదు. కానీ, మూలధాతువు ఏదో మిగిలిపోయి, మళ్లీ మళ్లీ పోరాటపు గ్రంథిని పునరుజ్జీవింపజేస్తుంది. సిద్ధాంతాన్ని బలహీనపరచి సినీ జనాకర్షణతో అధికారంలోకి వచ్చిన అన్నా డిఎంకె కూడా ప్రజలు గీసిన కొన్ని లక్ష్మణరేఖలను దాటలేకపోయింది. శ్రీలంక టైగర్లు అంటేనే విరుచుకుపడే జయలలిత, ఆమె పార్టీ కూడా రాజీవ్ హత్య కేసు నేరనిర్ధారితుల ఉరిశిక్ష రద్దును, విడుదలను డిమాండ్ చేయవలసి వచ్చింది. ప్రధాని హత్యకు కుట్ర పేరుతో దేశవ్యాప్తంగా మేధావులను, హక్కుల కార్యకర్తలను విచారణ లేకుండా సంవత్సరాల తరబడి నిర్బంధిస్తుంటే ముఖ్యమంత్రులెవరికీ నోరు పెగలదు కానీ, తమిళనాడు ముఖ్యమంత్రి మాత్రం ఒక మాజీప్రధాని హత్యకేసులో దోషుల విడుదలకు రాష్ట్రపతికి లేఖ రాయగలడు. ఒక్కోసారి దక్షిణదిక్కు ధిక్కారానికి గర్వంగా ఉంటుంది. అంతలోనే, తెలుగువారి దౌర్భాగ్యానికి దిగులూ కలుగుతుంది. ఎం.కె. స్టాలిన్ తండ్రిలాగా ద్రావిడ ఉద్యమం పాదుల నుంచి నడిచివచ్చినవాడు కాదు. బాల కార్యకర్తగా డిఎంకెలో జీవితంలో మొదలైనప్పటికీ, ఎమర్జెన్సీలో పోలీసు హింస అనుభవం ఉన్నప్పటికీ, రాజకీయపు తొలిరోజుల్లో అతనికి ఏమంత సజ్జనుడన్న పేరు లేదు. తరువాత తరువాత కాలంలో, సుదీర్ఘ నిరీక్షణలో ఉన్న వారసుడిగా చాలా నేర్చుకోగలిగాడు. అయినా, కరుణానిధి వాగ్ధాటి కానీ, సాహిత్య స్పర్శ కానీ అతనికి అంటలేదు. కానీ, పోయిన నెలలో మొదటి సారిగా ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పటి నుంచి, అతను తన లోపాలను భర్తీచేసుకోవడానికి, ద్రవిడ ఉద్యమం నుంచి తీసుకోవలసిన దోహదాలను తీసుకుంటున్నాడు. తండ్రి లేని లోటును, ఉద్యమ సిద్ధాంతాలను తలకెత్తుకోవడం ద్వారా పూరించుకుంటున్నాడు. తమిళనాడును తీవ్రజాతీయవాదం నుంచి, దాని వల్ల కలిగే ఉత్పాతాల నుంచి రక్షించుకుని, తమకే పరిమితమయ్యే ఒక రక్షిత జనావరణంగా మలచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. రాజకీయ అనివార్యతల నుంచే కావచ్చు, కానీ, స్టాలిన్ తీరు అతనికీ, తమిళనాడుకు, దేశానికీ కూడా ప్రత్యేకమైన రాజకీయమార్గాన్ని సూచిస్తున్నది. 'ఒండ్రియ అరసు' అన్న మాట, తెలుగువాళ్లు వినే అవకాశం లేదు. తమిళనాడులో కూడా యాభై ఏళ్ల కింద బాగా వాడుకలో ఉండేది. తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి స్టాలిన్, ఆయన మంత్రివర్గ సహచరులు 'ఒండ్రియ అరసు' అన్న మాటనే వాడుతున్నారు. ఇది రాష్ట్ర బిజెపి నాయకులకు బాగా అసహనం కలిగిస్తోంది. 'ఒండ్రియ అరసు' అంటే, 'సమాఖ్య ప్రభుత్వం', ఇంగ్లీషులో యూనియన్ గవర్నమెంట్. మొన్నటి దాకా 'మత్తియ అరసు' అనేవారు. అంటే, 'కేంద్ర ప్రభుత్వం', సెంట్రల్ గవర్నమెంట్. స్టాలిన్ కేంద్రప్రభుత్వాన్ని రద్దుచేసి, సమాఖ్య ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టారన్నమాట, కనీసం భాషలో. రాజ్యాంగం ప్రకారం, భారత దేశం రాష్ట్రాల సమాఖ్య. కేంద్ర ప్రభుత్వం అనేది లేదు. సమాఖ్య ప్రభుత్వం మాత్రమే ఉన్నది-అన్నది వివరణ. అన్నాదురై కాలంలోను, కరుణానిధి హయాం తొలిరోజుల్లోనూ 'ఒండ్రియ అరసు'నే ఉపయోగించేవారు. తరువాత కాలంలో, పట్టింపు తగ్గిపోయి, ఇంగ్లీషులో సెంట్రల్ గవర్నమెంట్ అన్న వాడుక పెరిగిన తరువాత తమిళంలో కూడా 'మత్తియ అరసు' అనే మాటను వాడడం మొదలుపెట్టారు. ఇప్పుడు పనిగట్టుకుని సమాఖ్య ప్రభుత్వం అని వ్యవహరించడం ద్వారా డిఎంకె ప్రభుత్వం కేంద్రప్రభుత్వపు పరిమితులను సూచిస్తోంది. ముఖ్యమంత్రులు, మంత్రులు తమ అధికారిక వ్యవహారాల్లో కొత్త పదబంధాన్నే ప్రయోగిస్తూ ఉండడం వల్ల, పాత్రికేయుల భాషలోనూ ఆ ప్రయోగం వేగంగా వచ్చిచేరింది. ఈ మధ్య వివాదాస్పదమైన గోవా జిఎస్‌టి సమావేశంలో చేసిన ప్రసంగంలో తమిళనాడు ఆర్థికమంత్రి 'ఒండ్రియ అరసు'నే ఉపయోగించారు. తెలుగువారి దురదృష్టమేమిటంటే, మనకు ఒండ్రియమూ లేదు, మత్తియా లేదు. సమాఖ్య అన్నా, కేంద్ర అన్నా రెండూ సంస్కృతమే. ఆ రెంటి మధ్య ఉన్న తేడా గురించి కూడా మనకు ఏ పట్టింపూ లేదు. అన్నిటికీ తెలుగుమాటలుండాలన్న ఆదర్శం అసలు లేదు. ఎన్‌టి రామారావు అధికారంలోకి వచ్చిన మొదట్లో కేంద్రం మిథ్య అన్నారు. అదేదో వేదాంతపు ప్రకటన అనుకున్నవాళ్లే ఎక్కువ మంది. అన్నాదురై వంటి వారు ఏ అర్థంలో అన్నారో ఎన్టీయార్ కూడా అదే అర్థంలో అన్నారు. తమిళనాడులో వలె, బ్రాహ్మణవాద వ్యతిరేక, కేంద్రాధిపత్య వ్యతిరేక, భాషాభిమాన సిద్ధాంతాలను ఎన్టీయార్ కూడా ఆశ్రయించారు కానీ, మూడునాలుగేళ్ల పాలన తరువాత నిలకడగా ఆ వైఖరిని అనుసరించలేకపోయారు. అందువల్ల, తెలుగుదేశం ప్రాంతీయపార్టీగా మనుగడ సాగించగలిగినా, ప్రాంతీయ వాద సిద్ధాంతాలకు మాత్రం ఆ పార్టీ విధానాల్లో ప్రాధాన్యం తగ్గిపోయింది. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు రావడం, ప్రాంతీయ పార్టీలకు భాగస్వామ్యం లభించడం కూడా అందుకు కారణం కావచ్చును. భాషా ప్రాంతీయ పార్టీగా ఉండిన తెలుగుదేశం ప్రతిపత్తిని, భౌగోళిక ప్రాంతీయపార్టీ అయిన తెలంగాణ రాష్ట్రసమితి కుదించగలిగింది. ఏ ఉద్యమాలూ సిద్ధాంతాలూ లేకపోయినా, వైఎస్ ప్రతిష్ఠ, కాంగ్రెస్ పునాది నుంచి అధికారం దక్కించుకున్న జగన్మోహనరెడ్డి పార్టీ కూడా భౌగోళిక ప్రాంతీయపార్టీయే. టిఆర్ఎస్‌కు, వైసిపికి సిద్ధాంతాల బరువు లేకపోవడం వల్ల కేంద్రంతో చెట్టపట్టాలు వేసుకోగలగుతున్నారు. అనేక మార్లు సంకీర్ణాలలో భాగమైనప్పటికీ, రెండు సార్లు తమ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసిన కాంగ్రెస్ తోను, ద్రవిడ వాదానికే వ్యతిరేకమైన బిజెపితోను మైత్రి చేయవలసి వచ్చినప్పటికీ, డిఎంకెకు, తెలుగు అధికారపార్టీల లాగా, ఇప్పుడు కేంద్రంతో 'మంచి'గా ఉండగలిగే ఆస్కారం లేదు. తమిళనాడు ప్రజలు అందుకు అంగీకరించేలా లేరు. బిజెపి తలపెట్టిన రాజసూయం నుంచి తనను తాను రక్షించుకోవడానికి డిఎంకెకు ఏది కావాలో, తమ ప్రత్యేకతను ప్రతిపత్తిని నిలుపుకోవడానికి తమిళప్రజలకూ అదే కావాలి. అందుకే, పాతపడింది అనుకోకుండా ఫెడరలిజాన్ని డిఎంకె ప్రభుత్వం ఆయుధంగా అందుకున్నది. ఒక్క తమిళాన్నే కాదు, రాజ్యాంగంలో గుర్తించిన భాషలన్నిటిని అధికారిక భాషలుగా ప్రకటించాలని కొత్తగా డిమాండ్ చేసింది. ఇద్దరు తెలుగువీరులు, ఒక్కరన్నా అడగగలరా? ఎన్నికల ముందు చాలా మాటలు మాట్లాడతారు, కానీ, ఇవి డిఎంకె ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాట్లాడుతున్న మాటలు. అధికారం చేపట్టిన వెంటనే స్టాలిన్ తన ట్విట్టర్ పరిచయంలో "ద్రవిడ జాతికి చెందినవాడిని" అన్న మాటలు ఉంచారు. ఈ మాటలు అన్నాదురై ఒకనాడు పార్లమెంటులో అన్నవి. "భారతదేశంలో తాము భాగమే అయినప్పటికీ, ద్రవిడ జాతికి చెందినవారము" అని ఆయన 1960ల మొదట్లో అన్నారు. అన్నాదురైను తరచు స్టాలిన్ సాయం తెచ్చుకుంటున్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కాలంలో అయితే, పెరియార్ సాయం కూడా తీసుకున్నారు. మూడేళ్ల కిందటనే ద్రవిడస్థాన్ ప్రస్తావనను స్టాలిన్ తీసుకువచ్చారు. ఆ సమయంలోనే ఆంధ్రప్రదేశ్ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బిజెపికి వ్యతిరేక వైఖరి తీసుకుని, ఆ పార్టీ దూకుడుకు కళ్లెం వేయాలంటే, దక్షిణాది రాష్ట్రాల సమాఖ్య ఏర్పడాలని అన్నారు. రాజ్యాంగ బద్ధంగానే, భారతదేశంలో భాగంగానే దక్షిణాది రాష్ట్రాల హక్కులను, ఆర్థిక ప్రయోజనాలను కాపాడడానికి అటువంటి సమాఖ్యను చంద్రబాబు ప్రతిపాదించారు.. చంద్రబాబు, స్టాలిన్ మాటలను కలిపి విశ్లేషణలు చేసినవారున్నారు. ఆ సమయంలోనే, 15వ ఆర్థిక సంఘం విధివిధానాలు, చర్చాంశాలపై సంప్రదింపులు జరపడానికి తిరువనంతపురంలో కేరళ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, కర్ణాటక మంత్రులు, అధికారులు సమావేశమయ్యారు. తెలంగాణ నుంచి, అన్నాడిఎంకె అధికారంలో ఉన్న తమిళనాడు నుంచి ఎవరూ పాల్గొనలేదు. ప్రశాంత్ కిశోర్ సలహాపై నాస్తికాన్ని పలచన చేసి మేనిఫెస్టో ప్రవేశపెట్టిన స్టాలిన్, అధికారానికి వచ్చాక మరెంతగా తగ్గిపోతారో అని అనుకున్నారు. కానీ, తనకు, రాష్ట్రానికి ఎదురయ్యే ప్రమాదాన్ని నివారించడానికి సిద్ధాంత ఆయుధం కావలసిందేనన్న గ్రహింపు ఆయన పార్టీకి వచ్చింది. ప్రాంతీయ పార్టీలన్నీ కుటుంబపార్టీలే అయినట్టు, డిఎంకె కూడా ప్రాంతీయ పార్టీగా మారింది. ఒకసారి ప్రాంతీయ పార్టీగా మారాక, వ్యక్తి ఆకర్షణ, కేంద్రీకృత నాయకత్వం ఆధారంగా సంస్థ నడుస్తుంది. కానీ, డిఎంకెలో, వారసత్వం సరే, అనేక శ్రేణుల నాయకులు కూడా ఉంటారు, వారికి ప్రాముఖ్యం ఉంటుంది. ద్రవిడవాదాన్ని అధ్యయనం చేసే సిద్ధాంతులూ, మేధావులూ ఉంటారు. వారు ప్రభుత్వానికి, పార్టీకి దిశానిర్దేశం చేస్తారు. విధాన రచనలో వారికి భాగస్వామ్యం ఉంటుంది. సిద్ధాంతాలను ప్రోత్సహిస్తే, అవి తమ కంటె ఎక్కువ ప్రాధాన్యం పొందుతాయేమోననే భయం, ఉద్యమానికి విలువ ఇస్తే తమ ఉనికికి ప్రమాదమన్న బెదురూ ఆ పార్టీలో ఉన్నట్టు లేదు రాష్ట్రాల హక్కులను పరిరక్షించుకోవడానికి కానీ, భాషాసంస్కృతులు కాపాడుకోవడానికి కానీ, ఇప్పుడు తెలుగు ప్రాంతీయ పార్టీలకు ఏ సిద్ధాంతమూ లేదు. పోరాడవలసివస్తే ఏ వ్యూహమూ లేదు. కప్పం కట్టడానికి తహతహలాడే సామంతరాజుల వలె ఢిల్లీ దర్బారులో దాసోహం అనడం తప్ప, చర్చించవలసిన చట్టాలకు జై కొట్టడం తప్ప, ఈ బాలరాజుల వల్ల ఏ ఉపయోగమూ లేదు.

# బకాయిల భారంలో బిందు సేద్యం

హరిత విప్లవం మొదలైన నాటి నుంచి నేటి వరకు వ్యవసాయ రంగం ఎన్నో కొత్త పుంతలు తొక్కుతోంది. సుమారు రెండు దశాబ్దాల క్రితం ఇజ్రాయెల్ దేశ సాంకేతిక పరిజ్ఞానంతో మనదేశంలో బిందు సేద్యం అడుగు పెట్టింది. అడుగంటుతున్న భూగర్భజలాలు, పరిమితమవుతున్న నీటి వనరులకు ప్రత్యామ్నాయంగా పరిణమించిన బిందు సేద్యం మనదేశ మెట్ట ప్రాంత రైతులకు ఆశాకిరణంగా మారింది. 2002లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బిందు సేద్యం ప్రాజెక్ట్‌పై రైతులకి పూర్తి అవగాహన కల్పించారు. 50 శాతం ప్రభుత్వ రాయితీ, 50 శాతం సులభ వాయిదాల పద్ధతిలో బ్యాంకుల నుంచి రుణ సదుపాయాలు కల్పిసన్తూ, కావాలనుకున్న రైతులందరికీ బిందు సేద్యం పరికరాలు కూడా అందించారు. 2004లో ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి మరింత ముందడుగు వేసి, కేంద్ర ప్రభుత్వ సాయం కూడా తోడవడంతో ప్రభుత్వ రాయితీని 90 శాతానికి పెంచడం ద్వారా బిందు సేద్యాన్ని మరింత పరుగులు పెట్టించారు. కానీ ఇది కొన్ని సంవత్సరాలకే పరిమితం అయింది. తర్వాత కాలంలో రైతులకు సరైన అవగాహన కల్పించడం లోనూ ఆర్థిక వనరులు సమకూర్చడం లోనూ విఫలమవుతూ వచ్చిన ప్రభుత్వాలు బిందు సేద్యానికి తీరని అన్యాయం చేశాయి. ఏదోలా కాడి ఈడ్చుకు వస్తున్న సూక్ష్మ నీటి బిందుసేద్య పథకానికి 2019లో వచ్చిన వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా పాడి కట్టినంత పని చేసింది. యాభై ఏళ్లకు పైగా విష రసాయనాలతో నిండిపోయిన వ్యవసాయంతో ఎదురవుతున్న బహుముఖ దుష్పలితాలు, భయంకర ఆరోగ్య సమస్యల నుంచి ప్రపంచం గుణ పాఠాలు నేర్చుకొంటోంది. ఇప్పుడిప్పుడే వ్యవసాయం సేంద్రియం వైపు మారుతున్న తరుణంలో సూక్ష్మ నీటి వినియోగం లాంటి విషయాలు అత్యంత కీలక పాత్ర వహిస్తున్నాయి. దానికి అనుగుణంగా పొరుగు రాష్ట్రమైన కర్ణాటక బిందు సేద్యంలో దేశంలోనే మొదటిస్థానంలో దూసుకు పోతోంది. మరో పొరుగు రాష్ట్రం తమిళనాడు కూడా దానికి పోటీగా రైతులను ప్రోత్సహిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని నమ్మి రైతులకి సూక్ష్మసేద్యం పరికరాలు అందించి, అమర్చిన కంపెనీలకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పన్నెండు వందల కోట్ల రూపాయలు బకాయిపడింది. సంవత్సరంన్నర దాటినా ఈ కంపెనీలకు నేటికీ ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. ఈ పరిణామంతో ఈ కంపెనీలు దివాలా దశకు చేరుకున్నాయి. వీటిలో పనిచేసే సుమారు ఇరవై వేల మంది కార్మికుల భవిష్యత్తుని ప్రశ్నార్థకంలో పడేయడంతో పాటు, కొత్తగా బిందు సేద్య పరికరాల కోసం ఎదురుచూస్తున్న రైతులు ఆశలపై ప్రభుత్వం నీళ్లు పోసింది. సూక్ష్మసేద్యం కంపెనీలకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల బ్యాంకర్లకు కంపెనీలు రుణ వాయిదాలు చెల్లించడం లేదు. బ్యాంకుల్లో, ఆర్థిక సంస్థల్లో ఈ కంపెనీల రుణాలు నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ)గా మారుతున్నాయి. కరోనా మహమ్మారి ఒకటి, రెండవ దశలు ఈ కంపెనీలను మరింత అంధకారంలోకి నెట్టి వేశాయి. ఈ బకాయిలు కంపెనీల ఉనికికే ప్రమాదకరంగా పరిణమించాయి. కంపెనీల నిర్వహణకై అనివార్య ఖర్చులు, రుణాల చెల్లింపులు నెరవేర్చవలసిన షరతుల నిర్వహణ తలకిందులైంది. బకాయిలు చెల్లించకపోవడం వలన ఉత్పత్తి లేక రైతులకు అందించవలసిన పరికరాల సరఫరా పూర్తిగా స్తంభించిపోయింది. అంకెల పరంగా చూస్తే రాష్ట్రం ఏడున్నర లక్షల ఎకరాలకు పైగా బిందుసేద్యంతో దేశంలో రెండో స్థానంలో ఉన్నది. అయితే రాష్ట్రంలో వినియోగిస్తున్న బోర్ల సంఖ్యాపరంగా, మెట్ట ప్రాంత వ్యవసాయ భూమి విస్తీర్ణం పరంగా చూసినప్పుడు బిందు సేద్యంలో మన రాష్ట్రం చాలా వెనుకబడి ఉన్న విషయాన్ని గుర్తించాలి. రైతులకు మరెన్నో వినూత్నమైన ఆధునిక సాంకేతికపరమైన కొత్త ప్రాజెక్టులు అందించాల్సిన ప్రస్తుత సమయంలో సాపేక్షంగా ఆంధ్ర రాష్ట్రంలో రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న బిందుసేద్యం పథకం నేడు కనుమరుగయ్యే దశకు చేరుకుంది. చిన్న, సన్నకారు రైతులే కాకుండా భూస్వాములు సైతం స్వంత ఖర్చులతో బిందు సేద్య పరికరాలు సమకూర్చుకొనే ఆర్థిక పరిస్థితులు లేవు. ఇది ముఖ్యమంత్రికి తెలియదా? బిందు సేద్య వ్యవసాయం కోసం గడచిన రెండేళ్ల పాలనలో ప్రభుత్వం చేసిన ఖర్చు ఏమైనా ఉందా? కూల్చివేతలతో మొదలైన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇలాంటి ప్రాజెక్టులను పాతర వేయడంలో ఆశ్చర్యం లేనప్పటికీ, దేశంలో ఎక్కడా లేనివిధంగా మాదే రైతులకి అత్యంత మేలు చేసే ప్రభుత్వమని బాకాలు ఊదుకునేందుకు ఏమాత్రం సిగ్గు లేకుండా ముందుకు రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గడచిన రెండేళ్ల కాలంలో వ్యవసాయ రంగానికి 83 వేల కోట్లు ఖర్చు పెట్టామని జగన్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. రాష్ట్ర రైతులకు మేలు చేసే బిందుసేద్య పరికరాలను అందించే కంపెనీలకు కట్టవలసిన రూ. 1200 కోట్ల బకాయిలు ఎందుకు గుర్తు రాలేదు? ప్రతీకారేచ్ఛతో రగిలిపోతూ ప్రత్యర్థులను ఇరుకున పెట్టడంలో చూపించే నేర్పరితనంలో కాస్తయినా రైతులకు మేలు చేసే ఇలాంటి పథకాలపై చూపించక పోవడం దురదృష్టకరం. రాజస్థాన్ తర్వాత దేశంలో అతి తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతం రాయలసీమ. 423 మిమీ సాధారణ వర్షపాతంతో రాయలసీమ అత్యంత నీటి ఎద్దడిని, ఎదుర్కొంటుంది. అటువంటి ప్రాంతం నుంచి వచ్చిన ముఖ్యమంత్రి అయి ఉండి కూడా బిందుసేద్య పథకాలను రైతుల దరి చేరకుండా నీరు గారుస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. 85 శాతం బిందుసేద్యంతో ఇజ్రాయెల్ వ్యవసాయంలో ఉచ్ఛ స్థాయిని చేరుకోగా, 2.1 శాతం బిందు సేద్యంతో ఉన్న మన దేశానికి, రాష్ట్రానికి ఆ స్థాయిని చేరుకోవడానికి ఎన్ని దశాబ్దాలు పట్టనుంది? ఆంధ్ర రాష్ట్ర రైతుల బిందు సేద్యం, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ బకాయిల భాండాగారంలో బందీ అయింది.

# మారిషస్‌లో తెలుగు బాంధవుడు



మారిషస్ దేశానికి పదేళ్ళపాటు అధ్యక్షుడుగానూ, పద్దెనిమిదేళ్లపాటు ప్రధాన మంత్రిగాను పనిచేసిన సర్ అనిరుధ్ జగన్నాథ్ జూన్ 3న తమ 91వ ఏట పరమపదించారు. 1930 మార్చ్ 29న ఒక యాదవ కుటుంబంలో ఆయన జన్మించారు. ఈ కుటుంబం 1850ల్లో బిహారులోని అత్లిపురా గ్రామం నుంచి మారిషస్‌కు వ్యవసాయ కూలీలుగా వలస వెళ్ళింది. చెరకు తోటల్లోని కార్మికుడి కుమారుడైన అనిరుధ్ జగన్నాథ్ మారిషస్ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగి, ఆధునిక మారిషస్ నిర్మాతగా చరిత్రకెక్కారు. 'మిలిటెంట్ సోషలిస్ట్ మూమెంట్ పార్టీ'ని స్థాపించి, మారిషస్ రాజకీయాలలో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారు. ప్రస్తుత మారిషస్ ప్రధాని ప్రవీంద్ కుమార్ అనిరుధ్ జగన్నాథ్ గారి కుమారుడే. అనిరుధ్ జగన్నాథ్‌కు తమ పూర్వీకుల జన్మభూమి అయిన భారతదేశమంటే అమితమైన ప్రేమాభిమానాలుండేవి. భారత్ %--% మారిషస్ దేశాల మైత్రీ బంధానికి ఆయన బంగారు బాటలు వేశారు. ఆయన నేత్ర చికిత్సకు హైదరాబాద్?లోని ఎల్.వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూటును ఎంపిక చేసుకున్నారు. మారిషస్ 'మినీ భారతదేశం' వంటిది. భారతదేశంలోని వివిధ భాషలు, సంస్కృతుల వారు ఆ దేశంలో నివసిస్తున్నారు. భారతీయ భాషలకు మారిషస్ ప్రభుత్వం ప్రోత్సాహమిచ్చింది. మారిషస్ జాతిపిత, అప్పటి ప్రధాన మంత్రి సర్ శివసాగర్ రామ్ గులాం హయాంలో 1974లో ఆ దేశంలో ప్రపంచ హిందీ సమ్మేళనం జరిగింది. అప్పుడు విద్య, సాంస్కృతిక శాఖల మంత్రిగా పనిచేస్తున్న మా నాన్నగారు మండలి వెంకట కృష్ణారావు గారు, కేంద్ర విద్యామంత్రి డా. కరణ్ సింగ్ నాయకత్వాన భారత ప్రతినిధి వర్గంలో సభ్యుడిగా ఆ మహాసభలలో పాల్గొన్నారు. అనిరుధ్ జగన్నాథ్ నాయకత్వంలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు 1980 డిసెంబర్ 10వ తేది నుంచి 13వ తేది వరకు మారిషస్?లోని మోకా నగరంలో మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూటులో ఘనంగా జరిగాయి. ఆ మహా సభలలో మా నాన్నగారు మండలి వెంకట కృష్ణారావు గారితో పాటు పాల్గొనే అవకాశం నాకూ లభించింది. విమానాశ్రయానికి మారిషస్ ఇంధన శాఖా మంత్రి మహేష్ ఉచ్చన్న వచ్చి, మాకు స్వాగతం పలికారు. ఆయన తెలుగువాడు కావడం మాకెంతో ఆనందాన్నిచ్చింది. మేము అక్కడకు వెళ్ళిన 7వ తేది రాత్రి మహాత్మాగాంధీ ఆడిటోరియంలో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలకు గవర్నర్ జనరల్ శ్రీ వీరాస్వామి రింగడు, ప్రధాని అనిరుధ్ జగన్నాథ్ వచ్చి, మమ్మల్ని పరిచయం చేసుకున్నారు. వీరాస్వామి రింగడు ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి వలస వెళ్ళిన తెలుగు వారి సంతతికి చెందిన వాడు కావడం మాకెంతో గర్వకారణమైంది. అనిరుధ్ జగన్నాథ్ సౌమ్యుడు, నిరాడంబరుడు. మా అందరితో ఎంతో సౌహార్ద్రంగా వ్యవహరించారు. ప్రపంచ తెలుగు మహాసభలను ప్రారంభిస్తూ, 'తెలుగు భాషా సంస్కృతుల అభ్యున్నతికి తమ దేశం పూర్తిగా తోడ్పాటునందిస్తుంద'ని తెలిపారు. మారిషస్?లో హిందీ మాట్లాడే వారి తరువాతి స్థానం తెలుగువారిదేనని తెలిపారు. తెలుగు వారు జరుపుకునే, తెలుగు సంస్కృతికి దర్పణమైన 'మహా రామ భజన', 'సింహాద్రి అప్పన్న పూజ', 'అమ్మోరి' పండు గలకు ప్రభుత్వపరంగా సహకారమందిస్తామని చెప్పారు. దేవాలయాల నిర్మాణానికి సబ్సిడీలు, పండుగలకు ప్రోత్సాహకాలు, మాతృభాషల అధ్యయనానికి బోధనావకాశాలను కల్పించి, సంస్కృతీ పరిరక్షణకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. భారతీయ సంస్కృతి విశిష్టతలు ప్రపంచానికి చాటి చెప్పిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ తెలుగువాడు కావడం తెలుగువారి గొప్పదనానికి నిదర్శనమని కొనియాడారు. ఆశించిన రీతిలో ఆనాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహాసభలకు తోడ్పాటు అందించకపోయినా, మారిషస్ ప్రభుత్వమే మొత్తం బరువు బాధ్యతలను తలకెత్తుకుని అపూర్వంగా ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడానికి కారకుడు అనిరుధ్ జగన్నాథ్. మారిషస్?లో ఏటా జరిగే తెలుగు పండుగలకు, ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాలకు, జాతీయ నాటికల పోటీలకు స్వయంగా హాజరై, అనిరుధ్ జగన్నాథ్ తెలుగువారిని ఉత్తేజపరచేవారు. ఆంగ్ల లిపిలో రాసుకుని తెలుగులో ప్రసంగించే ప్రయత్నం చేసేవారు. 1981లో 'మారిషస్ తెలుగు కల్చరల్ ట్రస్టు'ను ఏర్పాటు చేశారు. తెలుగు భవనం నిర్మించడానికి పది ఎకరాల స్థలం కేటాయించారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా భక్తుడైన జగన్నాథ్ చాలాసార్లు పుట్టపర్తి వచ్చారు. అనిరుధ్ జగన్నాథ్ మరణం మారిషస్ తెలుగు వారితో పాటు యావత్ తెలుగు జాతిని దిగ్భ్రాంతి పరిచింది. భారత ప్రభుత్వం ఆయనకు పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందజేసి, భారత సంతతికి చెందిన ఒక విదేశీ నేతను గౌరవించింది. ప్రస్తుత ప్రధాని ప్రవీంద్ కుమార్ జగన్నాథ్ తన తండ్రి బాటలోనే మారిషస్‌లో తెలుగు భాషా, సంస్కృతుల వికాసానికి తోడ్పాటునందిస్తున్నారు. అనిరుధ్ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ తెలుగు జాతి పక్షాన ఆయనకు నివాళులర్పిస్తున్నాను.

# ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం:మంత్రి





అమరావతి, ప్రజాపాలన : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు భరోసా ఇచ్చారు. రైతులు తప్పనిసరిగా తమ పేరును 'ఈ పంట'లో నవెూదు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో సూక్ష్మ సేద్యానికి అధిక ప్రాధాన్యతిస్తూ, ఈ ఏడాది యాక్షన్ ప్లాన్ లో భాగంగా రూ.1190.11 కోట్లతో లక్షన్నర హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ విస్తరింపజేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. వెలగపూడిలోని అసెంబ్లీ ప్రాంగణంలోని కమిటీ హాలులో పంటల కొనుగోలుపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పలువురు ఎమ్మెల్యేలతో పాటు వ్యవసాయ, సివిల్ సప్లయ్ శాఖాధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు కొడాలి వెంకటేశ్వరరావు(నాని), ఎం.శంకర నారాయణతో కలిసి ఆయన పాల్గొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ప్రతి ధాన్యపు గింజనూ మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నామన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న ఆర్బీకేల ద్వారా 'ఈ పంట' లోని %ఖుుఎఎం ాతీశీఎబతీవఎవత్ రాఅశ్రీఅఅవ% పోర్టల్ లో రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ పోర్టల్ లో పేర్లు నమోదు చేసుకోవడం వల్ల ఇతర రాష్ట్రాల రైతులు ఏపీలో తమ పంటలను విక్రయించుకునే అవకాశం ఉండదన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా రైతుల పొలాల వద్దకెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. దీనివల్ల దళారులు/మధ్యవర్తుల ప్రమేయం ఉండదన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తరవాత 21 రోజుల్లో రైతుల ఖాతాలో నేరుగా నగదు జమ చేస్తున్నామన్నారు. దీనివల్ల రైతులకు కనీస మద్దతు ధర లభిస్తోందన్నారు. రాష్ట్రంలో సూక్ష్మ సేద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 11.90 లక్షల మంది రైతులు 13.43 లక్షల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సూచనల మేరకు 2021-22 సంవత్సరానికి సంబంధించి మరో లక్షన్నర హెక్టార్లలో సూక్ష్మ సేద్యం చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందుకోసం రూ.1190.11 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం చేసే రైతులకు 90 శాతం సబ్సిడీ అందజేయనున్నామన్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాలో 4 హెక్టార్లు కలిగిన రైతులకు 70 శాతం, 5 హెక్టార్లు కలిగిన ప్రకాశం జిల్లా మినహా మిగిలిన కోస్తాంధ్ర జిల్లాల రైతులకు 50 శాతం మేర సబ్సిడీ అందజేయనున్నామన్నారు. రబీ సీజన్ లో నేటి వరకూ ఎన్ని టన్నుల మేర ధాన్యాన్ని కొనుగోలు చేశారని సివిల్ సప్లయ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సివిల్ సప్లయ్ శాఖ ఈవో కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ, 2020-21 పంటల కాలానికి సంబంధించి 45 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకూ 3,78,206 మంది రైతుల నుంచి రూ.4,728.81 కోట్ల విలువ చేసే 25,25,927 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఎంత వరి పంట ఉన్నా కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య మాట్లాడుతూ, తతతరాష్ట్రంలో సూక్ష్మ సేద్యం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. వాణిజ్య పంటల కొనుగోలు వివరాలను మార్క్ ఫెడ్ అధికారులు వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి కన్నబాబు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు అనంతరం రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నామన్నారు. నగదు జమలో ఎక్కడైనా సమస్యలు ఎదురైతే తనకు దృష్టికి తీసుకురావలని, తక్షణమే ఆ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రైతును ఆర్థికంగా అభివృద్ధి చేయడమే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. అన్నదాత సంక్షేమానికి వేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కొడాలి వెంకటేశ్వరరావు(నాని) మాట్లాడుతూ, ప్రతి రైతుకూ ఆర్థికంగా మేలు కలుగజేయాలన్నదే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపితే, అధికారుల సాయంతో వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, పలువురు ఎమ్మెల్యేలు, మార్క్ ఫెడ్ ఎం.డి. ప్రద్యుమ్న, వ్యవసాయ శాఖ కమిషనర్ అరుణ్ కుమార్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఎం.డి. సూర్య కుమారి, మైక్రో ఇరిగేషన్ పీవో హరనాథ్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## రెండు బైకులను డీ కొట్టిన ఆటో

పొన్నూరు, ప్రజా పాలన ప్రతినిధి : స్థానిక నిడుబ్రోలు ఓవర్ బ్రిడ్జి పై నిడుబ్రోలు వైపు నుంచి పొన్నూరు వస్తున్న రెండు బైకులు ను ఓవర్ స్పీడ్ తో వచ్చి ఒక ప్యాసింజర్ ఆటో ఢీ కొట్టి పరారైనది. బైకులు, ఆటో కూడా నిడుబ్రోలు కు చెందింంవని ఈ సంఘటన చూసిన ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. బైకులు మీద ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పొన్నూరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### కరోనా బాధిత కుటుంబాలకు సహాయం అందజేత



పొన్నూరు, ప్రజా పాలన ప్రతినిధి: కరోనా వైరస్ వల్ల ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు వారి ఇంటివద్దకే వెళ్ళి సహాయం అందజేయడం గొప్ప సేవా దృక్పథంఅని ఇలా జిల్లా వ్యాప్తంగా బాధిత కుటుంబాలకు సహాయం చేస్తున్న మన్నవ ఫౌండేషన్ చైర్మన్ డా. రెవరెండ్ మన్నవ రమేష్ అభినందనీయులు అని పొన్నూరు మండలం మమిళ్ళపల్లి గ్రామ సర్పంచ్ జాలాది యానాదిరావు అన్నారు. కరోనా వైరస్ వలన తొట్టెంపూడి గ్రామములో మరణించిన ఐరా బాబురావు, తమలపాకుల పెదనాగయ్య కుటుంబాలను గురువారం పరామర్శించారు. వారికి కరోనా రిలీఫ్ కిట్స్, బియ్యం, సరకులు, కూరగాయలు, ఆర్థిక సహాయం సర్పంచ్ యానదిరావు చేతులమీదుగా అందించారు. మన్నవ ఫౌండేషన్ చైర్మన్ డా. రమేష్ మాట్లాడుతూ అన్యం పుణ్యం ఎరుగని వారిని కరోనా వైరస్ రూపంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సహాయం చేసే అవకాశం భగవంతుడు మాకు కల్పించడన్నారు. ధైర్యముగా ఉండాలని బాధిత కుటుంబాలకు అండగా ఉంటామ న్నారు. ఈ కార్యక్రమంలో తొట్టెంపూడి గ్రామ ఉపసర్పంచ్ మేళం శేషుబాబు, గ్రామ పెద్దలు తమనం ఆనందరావు, గొల్ల రాములు ఫౌండేషన్ సభ్యులు మన్నవ జాన్, కెవిన్ పాల్గొన్నారు.



## శ్రీ భగలాముఖి అమ్మవారిని దర్శించుకున్న కాకినాడ డిప్యూటీ కమిషనర్

చందోలు (పిట్టలవాని పాలెం ), జూన్ 10, ప్రజాపాలన ప్రతినిధి: చరిత్ర ప్రసిద్ధిగాంచిన చందోలు గ్రామం లో స్వయంభువుగా అవతరించిన దశమహావిద్యలలో ఎనిమిదవ స్థానాన్ని అధిష్టించిన శ్రీ భగలాముఖి అమ్మవారి దేవస్థానాన్ని గురువారం కాకినాడ దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీ మేడేపల్లి విజయరాజు సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ భగలాముఖి అమ్మవారు దేవస్థానం ఆంధ్రప్రదేశ్లో ఉండటం ఎంతో గర్వకారణంగానూ ఎంతో గొప్ప ప్రాచుర్యాన్ని పొందుతుందని ఇటువంటి ప్రాచీన దేవాలయమును సందర్శించటం తనకెంతో సంతోషాన్ని కలిగించిందని తమ మన భావాన్ని వ్యక్తం చేశారు. వారితో పాటు కృష్ణాజిల్లా డిప్యూటీ ఇంజనీర్ జి. శ్రీనివాస్ దేచిరాజు ప్రసాద్ , ఉగ్గయ్య వెంకటపతి, పెనుగొండ రాదయ్య, వక్కలగడ్డ ప్రసాదు, ఏఈ చక్రధరరావు వగైరాలు అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత ఆలయ మర్యాదలతో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ జి.నరసింహ మూర్తి స్వాగతం పలికి వేదపండితుల ఆశీర్వచనం అమ్మవారి పిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కే. శ్రీనివాసరావు విష్ణువర్ధన్, వేణుగోపాల్ సహకరించారు.





## కడుపులో ఉన్న బిడ్డ దగ్గర నుండి తాతలు,అవ్వాలు వరకు రాష్ట్రంలో సంక్షేమ పథకాలు:వైఎస్ఆర్సిపి నాయకులు తలారి నాని

నరసరావుపేట, జూన్ 10, ప్రజాపాలన ప్రతినిధి: సీఎం జగన్ మోహన్ రెడ్డి సహకారంతో మన ప్రియతమ నేత పేదల పెన్నిధి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు 14వ వార్డులోని అంగన్ వాడి కేంద్రం లో ఫోర్ట్ ఫ్రెడ్ రైస్ అవగాహన సదస్సు కార్యక్రమం జరిగింది . ఈ సందర్భంగా తలారి నాని మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రానికి మన డైనిమిక్ లీడర్ మన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మన నియోజవర్గానికి దొరకడం ఎంతో అదృష్టం ఎందుకంటే కడుపులో ఉన్న బిడ్డ దగ్గర నుండి తాత అవ్వాల వరకు ప్రతి ఒక్కరికి ఎన్నో లబ్ధిలు చేకూరుస్తున్నందుకు మనం అందరం మన సీఎం ని మన ఎమ్మెల్యే ని గుర్తు పెట్టుకోవాలి అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు వైసీపీ నాయకులు .పాతర్ల చిన్ని.పర్చూరి సురేష్ .అలాగే %×.జ.ణ.ా% సూపర్ వైజర్ %+%. శాంత కుమారి అంగన్వాడీ కార్యకర్తలు %ూా%. ఇందిర బ్లేస్సి వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ క్వాటర్ బాటిల్స్ పట్టివేత

**ఒకరి అరెస్టు పరారీ లో ముగ్గురు**



బెల్లంకొండ: (ప్రజా పాలన) మండలంలోని శ్రీ రామాంజనేయ పురం తండా మన్నె సుల్తాన్ పాలెం గ్రామాల మధ్య గల అటవీ ప్రాంతంలో తెలంగాణకు సంబంధించిన అక్రమ మద్యం వస్తుందని పక్కా సమాచారంతో ఆ దారిలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి తన ద్విచక్ర వాహనం మీద రెండు మూటలతో వస్తుండగా అనుమానం వచ్చి ఆ మూటలను తనిఖీ చేయగా ఆ మూటలో దాదాపుగా 464 తెలంగాణకు చెందిన క్వాటర్ బాటిల్స్ ఉన్నట్లు స్థానిక ఎస్సై. కె.రాజశేఖర్ తెలిపారు స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారుగా 96 వేల రూపాయలుగా ఉంటుందని వారు పేర్కొన్నారు పట్టుబడ్డ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని అదేవిధంగా ఈ అక్రమ మద్యనికి సంబంధించి ఇంకో ముగ్గురు వ్యక్తులు పరారీ లో ఉన్నట్లు త్వరలోనే వారిని కూడా అదుపులోకి తీసుకోనీ రిమాండ్ కు పంపడం జరుగుతుందని వారు తెలిపారు గుంటూరు రూరల్ జిల్లా ఎస్పీ ఆదేశాల అనుసారం దాడులు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు మండలంలో అక్రమ మద్యం. గుట్కా వ్యాపారం. పేకాటలు నిర్వహించిన అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని వారు పేర్కొన్నారు ఈ దాడుల్లో ట్రైనీ ఎస్ఐ సత్యనారాయణ. హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్. బాజీ. హనుమంతు రావు సిబ్బంది పాల్గొన్నారు

## యాసిన్ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ఆత్మీయ పరామర్శ



పొన్నూరు, జూన్ 10, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర షేక్ కార్పొరేషన్ చైర్మన్ పొన్నూరు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రముఖ నాయకుడు దివంగత షేక్ యాసిన్ కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి తాడేపల్లి లోని ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిశారు. వైఎస్సార్ కుటుంబానికి వీరాభిమాని, దివంగత షేక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ యాసిన్ కుటుంబ సభ్యులు, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యతో కలిసి ముఖ్యమంత్రి నివాసంలో జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. ముఖ్యమంత్రి జగన్ వారిని ఆత్మీయంగా ఆహ్వానించి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. యాసిన్ తో తనకున్న అనుభవాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. యాసిన్ మనవడిని ఎత్తుకుని గుండెకు హత్తుకుని ముద్దాడారు. యాసిన్ కుటుంబ సభ్యులు అంటే నాకు కుటుంబంతో సమానమని ఎప్పుడు ఏ అవసరం వచ్చిన నా దృష్టికి తీసుకురావచ్చునని మీకు అండగా నేను, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఉన్నామని, ఉంటామని ముఖ్యమంత్రి జగన్ యాసిన్ కుమారుడు సైఫుల్లాకు,ఇతర కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు.

## కారంపూడి మండల కాపు యువసేన అధ్యక్షుడిగా నూనె శ్రీనివాస్



కారంపూడి.. జూన్10... ప్రజా పాలన ప్రతినిధి: మండలం కాపు యువసేన అధ్యక్షుడిగా కారంపూడి పట్టణానికి చెందిన నూనె శ్రీనివాస్ ని నియమించారు ఈ మేరకు రాష్ట్ర కాపు యువసేన జేపీసీ నిర్ణయం మేరకు కారంపూడి కి చెందిన నూనె శ్రీనివాస్ ని నియామకం జరిగినట్లు రాష్ట్ర మరియు జిల్లా కమిటీ సభ్యులు ఈ మేరకు శ్రీనివాస్ కి నియామక పత్రం అందజేశారు ఈ సందర్భంగా పలువురు నాయకులు అధికారులు కారంపూడి కాపు సంఘ అధ్యక్షుడు గా నియమితులైన నూనె శ్రీనివాస్ ని అభినంధిస్తున్నారు .

## వృద్ధులకు బ్రెడ్లు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



సత్తెనపల్లి, జూన్ 10, ప్రజాపాలన ప్రతినిధి: సత్తెనపల్లి పట్టణంలోని గుంటూరు రోడ్ లో గల ఆదరణ వయోవృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు తన తండ్రి గారైన జోగిపంచకట్ల వెంకటేశ్వర్లు రెండవ వర్ధంతిని పురస్కరించుకొని జోగేశ్వరరావు శుక్రవారం బ్రెడ్లు, మజ్జిగ ప్యాకెట్లు వృద్ధులకు అందజేశారు . ఈ సందర్భంగా జోగేశ్వరరావు మాట్లాడుతూ వృద్ధులకు చేస్తున్న సేవలు భగవంతునికి చేస్తున్న సేవలుగా భావించాలని ఆదరణ వృద్ధుల ఆశ్రమం నిర్వాహకుడు మరియదాసు ధన్యుడని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మజ , బాలాజీ , వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా హిజ్రాలకు నిత్యవసర సరుకులు పంపిణీ

**టిడిపి సీనియర్ నాయకులు ముక్కపాటి లింగయ్య**



కారంపూడి... జూన్10..ప్రజాపాలన ప్రతినిధి, :హిందూపురం శాసనసభ్యులు సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు పురస్కరించుకొని కారంపూడి మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ముక్కపాటి లింగయ్య హిజ్రాలకు నిత్యావసర సరుకులు అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో హిజ్రాలు పూట గడవక ఇబ్బంది పడుతున్నారు అన్న విషయం తెలుసుకొని వారిని ఇంటికి పిలిపించి నిత్యావసర సరుకులు అందించడం జరిగిందని ఆయన తెలిపారు పేదవారు నీ ఎవరైనా ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన అన్నారు ఇటీవలకాలంలో పంచాయితీ పారిశుద్ధ్య సిబ్బంది జీతాలు లాగా ఇబ్బంది పడుతున్నారు అనీ ఈ విషయం తెలుసుకొని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లింగయ్య వారికి నిత్యావసర సరుకులు కూడా అందించారు సేవా కార్యక్రమాలు చేపట్టడంలో లింగయ్య ఎప్పుడు ముందుంటారని చెప్పవచ్చు పార్టీ ఏదైనా పేదవారిని ఆదుకోవడానికి లింగయ్య ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటారని తెలుస్తోంది ఏది ఏమైనా కరోనా సమయంలో ముక్కపాటి లింగయ్య సేవలు అభినందనీయమని చెప్పవచ్చు. లింగయ్య గత ప్రభుత్వ హయాంలో కారంపూడి పి.హెచ్.సి అభివృద్ధి కమిటీ చైర్మన్ గా పనిచేశారు.

# త్వరగా వరికెపూడిశెల ప్రాజెక్టు పూర్తి చేసి తీరుతాం

**-పల్నాడు ప్రాంతాన్ని నీటితో శశ్యస్యామలం చేస్తాం**
**-తాగు, సాగు నీటిని పుష్కలంగా అందిస్తాం**
**-ప్రాజెక్ట నిర్మాణంలోని అన్ని అంశాలను పూర్తి చేసుకుంటూ అడుగులు వేస్తున్నాం**
**-నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు**
**-ప్రాజెక్టుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించి, వరికెపూడిశెల ప్రాంతాన్ని సందర్శించిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కలెక్టర్ వివేక్ యాదవ్**

గుంటూరు ప్రజాపాలన :పల్నాడు ప్రాంత ప్రజల 7దశాబ్ధాల కల వరికెపూడిశెల ప్రాజెక్టును అత్యంత త్వరగా పూర్తిచేసి పల్నాడును నీటితో శశ్యస్యామలం చేస్తామని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పల్నాడుకి తాగు, సాగు నీటిని పుష్కలంగా అందించే వరికెపూడిశెల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో ఇమిడి ఉన్న అన్ని అంశాలను పూర్తి చేసుకుంటూ అడుగులు వేస్తున్నామని, 2024 ఎన్నికల్లోపే ప్రాజెక్టును పూర్తి చేసి నీరందించేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నట్లు ఎంపీ చెప్పారు. ప్రాజెక్ట నిర్మాణానికి సేకరించాల్సిన అటవీ భూమిని పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు పనులు చేపట్టబోయే ప్రాంతాన్ని ఎంపీ, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కలెక్టర్ వివేక్ యాదవ్, అధికారులు సందర్శించారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ ప్రాజెక్టు వల్ల దిగువ ప్రాంతాలకు నీరందుతోంది కానీ, ఎగువ ప్రాంతాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఈ ప్రాజెక్ట ప్రాధాన్యతను, అవసరాన్ని జగన్ మోహన్ రెడ్డికి విన్నవించామని.. ఆనాడే ఈ ప్రాజెక్ట నిర్మిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రభుత్వం ఎన్నో ముందడుగులు వేసిందన్నారు. మొదటి దశ నిర్మాణానికి రూ.350కోట్లు కేటాయించందని, ఇప్పటి వరకు మొత్తం రూ.1623 కోట్లకు ఆమోధం తెలిపినట్లు చెప్పారు. రెండో దశలో డీపీఆర్‌కు రూ.2కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులో అత్యంత ముఖ్యమైన విషయం.. అటవీ ప్రాంతంలో ఉన్న ఈ ప్రాజెక్టుకు భూమి సేకరణ.. ఈ ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేసేందుకు కలెక్టర్ వివేక్ యాదవ్‌తో కలసి ఈరోజు సందర్శించినట్లు తెలిపారు. ప్రాజెక్ట కోసం సేకరించాల్సిన 28 ఎకరాలకు బదులు.. అటవీ శాఖకు ఇవ్వాల్సిన 56 ఎకరాల పరిహార భూమిని సేకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్‌ను ఈ సందర్భంగా ఎంపీ కోరారు. అటవీ అనుమతుల నివేదికలు కేంద్రానికి





పంపితే క్లియరెన్స్‌కు 6నెలల కాలం పడుతుందని తెలిపారు. పల్నాడు జలప్రధాయని అయిన ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు నీటి కొరత లేకుండా చూస్తామని స్పష్టం చేశారు.

## వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణ పనులుకు వడివడిగా అడుగులు వేస్తున్న జగనన్న ప్రభుత్వం



మాచర్ల (ప్రజాపాలన ప్రతినిధి) : మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలంలోని వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన భూములను పరిశీలన చేసి అనంతరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన గుంటూరు జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ , నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ మాచర్ల శాసనసభ్యులు శ్రీ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వై.యస్.ఆర్.సి.పి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి శ్రీ పిన్నెల్లి వెంకటరామిరెడ్డి మరియు ఇరిగేషన్ అధికారులు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఇప్పటికే ప్రాజెక్టుకు వై.యస్.అర్ పల్నాడు దుర్భిక్ష నిర్మూలన మిషన్ లో విలీనం చేసి బడ్జెట్ 2020- 21 లో మొదటి ఫేస్ నిర్మాణానికి రూ. 350 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకు మొత్తం రూ. 1623 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

## నిస్వార్ధ దేశభక్తుడు ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య



చీరాల(ఒంగోలు) :చీరాల పేరాల ప్రజా ఉద్యమాన్ని , నిస్వార్ధంగా ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి, అన్నీ తానై నడిపించిన మహోన్నత వ్యక్తి, నిస్వార్ధ దేశభక్తుడు, ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అని , వివేకానంద సేవా సమితి అధ్యక్షులు సర్వి శెట్టి సుబ్బరామయ్య అన్నారు. వివేకానంద సేవా సమితి కార్యాలయంలో, గురువారం ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వర్ధంతి సందర్భంగా, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ , చీరాల పేరాల ప్రజా ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించి, బ్రిటిష్ వారి పై విజయం సాధించిన సాహస దేశభక్తుడు ఆంధ్ర రత్న దుగ్గిరాల అన్నారు. చీరాల పేరాల ఉద్యమం ద్వారా, స్వాతంత్ర సమరంలో చీరాల కు ప్రత్యేక గుర్తింపును తీసుకు వచ్చిన దుగ్గిరాల చరిత్ర, ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి అధ్యక్షులు సర్వి శెట్టి సుబ్బరామయ్య , కొత్తూరు ప్రభాకరరావు, చేబ్రోలు తిరుమల రావు, రేణుక, ప్రముఖ కవి డాక్టర్ బీరం సుందరరావు, వివేకానంద సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు సిఐటియు నిరసన

**- చీరాల వేటపాలెం నిరసన కార్యక్రమాలు**
**- ప్రతి కుటుంబానికి నెలకు 7500/- భృతి ఇవ్వాలి అని డిమాండ్**
**- రైతు వ్యతిరేక నల్ల చట్టాలను, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను రద్దుచేయాలి**

చీరాల/వేటపాలెం (ఒంగోలు) : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా , సీఐటీయూ ఆధ్వర్యంలో చీరాల, వేటపాలెం లలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం కరోనా నియంత్రణ లో ఘోరంగా విఫలమైందని అన్నారు. కరోనా వారియర్స్ గా పనిచేసిన వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కావడం లేదు అన్నారు. కనీసం రక్షణ సౌకర్యాలు కూడా కల్పించని కారణంగా, వేలాదిమంది వారియర్స్ రాష్ట్రంలో మృత్యువాత పడుతున్నారు అన్నారు. కరోనా కాలంలో ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, ధరలు పెంచి భారాలు మోపుతున్నారు అన్నారు. కరోనా కాలంలో తెచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను రద్దుచేయాలని అన్నారు. కరోనా కాలంలో ప్రజలను ఆదుకోవడానికి ఇన్ టాక్స్ పరిధిలోకి రాని ప్రతి కుటుంబానికి నెలకు 7500/- భృతి ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. వేటపాలెం కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎన్. బాబూరావు, అయ్యప్ప రెడ్డి, ఆంజనేయులు, రాణి, సిరీషా, చీరాల ఐ ఎల్ టి డి కంపెనీ వద్ద సంఘ నాయకులు జి. సుధాకర్, సిహెచ్ . శివరాజు, లక్ష్మినారాయణ, నీలంబరం తదితరులు, ఈపురుపాలెంలో ఎమ్.వసంతారావు, పి. కొండయ్య , జయరాజు, తదితరులు పాల్గొన్నారు.



## కోవిడ్ బ్లాక్ ఫంగస్ సోకినవారికి తక్షణమే మెరుగైన చికిత్సను అందించాలి:జిల్లా కలెక్టరు జె. నివాస్




విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి : కోవిడ్ బ్లాక్ ఫంగస్ వైరస్ సోకినవారికి తక్షణమే వైద్యసహాయం అందించాలని ఇందుకు ఆక్సిజన్ బెడ్లును సిద్ధంగా ఉంచాలని ప్రభుత్వ వైద్యశాలలు వార్డు/గ్రామసచివాలయాల్లో అవసరమైన వైద్యసిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టరు జె. నివాస్ తెలిపారు. జిల్లాకు చెందిన ప్రభుత్వ వైద్యాధికారులు పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజ్ నిమ్ర ఇంజినీరింగ్ కాలేజీ తదితర కోవిడ్ కేంద్రాల నిర్వాహకులతో గురువారం జిల్లా కలెక్టరు జె. నివాస్ విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్పటల్స్ నిర్వహణకు వైద్యాధికారులు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. కోవిడ్ కారణంగా మెరుగైన వైద్యసహాయం అందించేందుకు అవసరమైన ఐసియు, ఆక్సిజన్ బెడ్లు సిద్ధంగా ఉంచాలన్నారు. ఎక్కడా ఆక్సిజన్ కొరత లేకుండా అప్రమత్తంగా ఉండాలని అధిక సామర్థ్యంగల ఆక్సిజన్ టాంకర్లు హాస్పటల్ లో సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రభుత్వం వైద్యాధికారులు, సిబ్బందిని నియమించేందుకు సానుకూలంగా ఉందని అవసరమైన సిబ్బంది వివరాల నివేదికను వెంటనే సమర్పించాలని కలెక్టరు సూచించారు. బ్లాక్ ఫంగస్ సోకిన రోగులకు వైద్యసహాయం అందించేందుకు ఇయన్నీ జనరల్ ఫిజీషియన్లు ఆసుపత్రుల్లో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలో కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రక్రియ వివరాలను సంబంధిత అధికారుల నుండి అడిగి తెలుసుకున్న కలెక్టరు 45 సంవత్సరాలు నిండిన వారికి రెండవ దశ వ్యాక్సినేషన్ దాదాపు పూర్తి కావచ్చిందని మొదటిదశ వ్యాక్సినేషన్ అందించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యాక్సినేషన్ కేంద్రాల్లో వ్యాక్సిన్ ను సిద్ధంగా ఉంచాలని కలెక్టరు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్లు యల్. శివశంకర్ (అభివృద్ధి), యస్. నుపూర్ అజయ్ కుమార్ (హౌసింగ్), డియం హెచ్ డా. యం. సుహాసిని, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. శర్మిష్ట, డిసి హెచ్ ఎ స్ డా. జ్యోతిర్మయి, సిద్ధార్థ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డా. జి. రాజ్యలక్ష్మి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శివశంకర్, ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్టు కోఆర్డినేటర్ డా. యండి. ఉస్మాన్, శాంపిల్ కలెక్టరు నోడల్ ఆఫీసర్ డా. పి. నవీన్, పిన్నమనేని సిద్ధార్థ కళాశాల ప్రతినిధి శివ, నిమ్ర వైద్యకళాశాల వైద్యులు డా. శివరంజన్, తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మ స్వరూపుడు బత్తుల బ్రహ్మారెడ్డి

చీరాల(ఒంగోలు) : భగవంతుడు బ్రహ్మ మనుషులకు ప్రాణం పోస్తే, ఆపన్నులైన ఆ మనుషుల ఆకలిని తీరుస్తూ, తన వంతు వారికి చేయూతను అందిస్తూ, బత్తుల బ్రహ్మారెడ్డి పలు సామాజిక సేవాకార్యక్రమాలను నిర్వహిస్తూ, చేయూతను అందిస్తూ, ఆ మనుషులకు జీవం పోస్తున్నారు. ఆకలిగా ఉన్నవారికి అన్నదానం, ఇబ్బందుల్లో ఉన్న వారికి ఆర్థిక చేయూత, పేద విద్యార్థులకు విద్యాదానం, తదితర లెక్కలేనన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న , బత్తుల బ్రహ్మారెడ్డి బ్రహ్మ స్వరూపుడు అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. కరోనా కష్టకాలంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి బత్తుల సర్వీస్ ట్రస్ట్ ఏర్పాటుచేసి, ట్రస్టు ద్వారా చేపడుతున్న పలు సామాజిక సేవాకార్యక్రమాలు, ప్రజల ప్రశంశలను అందుకుంటు న్నాయి. ట్రస్ట్ అధ్యక్షునిగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా, గురువారం వేటపాలెం మండలం కొత్తపేట గ్రామం పంచాయతీ పరిధిలోని లక్ష్మీ శ్రీనివాస హౌసింగ్ కాలనీ కాపలాదారులు ఏడుగురికి, పారిశుద్ధ్య కార్మికులు నలుగురికి, వార్డు వాలంటీర్, కాలనీ పూజారి, ఏఎన్ఎం మరియు ఆశా వర్కర్ మొత్తం 15 మందికి, ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు విలువ చేసే నిత్యవసర వస్తువులను గురువారం పంపిణీ చేశారు .కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి, తమ సేవలను అందజేస్తున్న , వార్డు వాలంటీర్ రామాంజనేయులు, ఏ ఎన్ ఎం విజయ కుమారి, ఆశా వర్కర్ హెప్సిబా లను అభినందించి, వారిని సముచితంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి వడలి రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు సింహాద్రి యలమందా రెడ్డి, ప్రముఖ కవి బీరం సుందరరావు, ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




## మద్యం దుకాణాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు:చందోలు ఎస్ఐ శివయ్య



ప్రజాపాలన :చందోలు (పిట్టలవానిపాలెం) : మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలలో రికార్డులు పక్కాగా సక్రమంగా ఉండాలని చందోలు ఎస్ఐ శివయ్య తెలిపారు. గురువారం స్థానిక చందోలు పోలీస్ స్టేషన్లో మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణాల్లో ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా సక్రమంగా పని చేయాలని సూచించారు. ఎవరైనా సిబ్బంది నిబంధనలు ఉల్లంఘించి అక్రమార్కులకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తు వారికి సహకరిస్తే అటు వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు....లి

## "జగనన్న పాలవెల్లువ"కార్యక్రమం విస్తరింప చేయాలి :జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్

ఒంగోలు,జూన్10(ప్రజాపాలన ప్రతినిధి ):ప్రకాశం జిల్లాలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమం విస్తరింప చేయాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. అమూల్ సంస్థ భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పాల ఉత్పత్తుల అభివృద్ధిపై మండల స్థాయి అధికారులతో గురువారం కలెక్టరేట్ నుంచి జెసి టిఎస్ చేతన్ తో కలసి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. అనంతరం పశుసంవర్ధక శాఖ, ఎపి డెయిరీ, అమూల్ సంస్థ అధికారులతో తన ఛాంబర్ లో ప్రత్యేకంగా సమీక్షించారు. రైతుల ఆర్ధిక పరిస్థితి మరింత మెరుగు పడడానికి అమూల్ సంస్థతో కలసి ప్రభుత్వం పనిచేస్తుందని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ చెప్పారు. పాల ఉత్పత్తి సహకార సంఘాలలో సభ్యులుగా చేరిన వారికీ భవిష్యత్తులో మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ బేబి రాణి, నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు, అమూల్ సంస్థ ప్రతినిధి ధీరజ్, డెయిరీ డిడి వెంకట్, ఎంపిడివోలు, పశు సంవర్ధక శాఖాధికారులు పాల్గొన్నారు.

## జూన్12 నుండి తిరుమలలో వసతి గదుల కేటాయింపు



తిరుమల,జూన్10(ప్రజాపాలన ప్రతినిధి ): ఈనెల 12వ తేదీ నుండి తిరుమలకు వచ్చే భక్తులకు మరింత సులభంగా వసతి గదుల కేటాయింపు జరుగుతుందని టిటిడి అధికారులు తెలిపారు. భక్తుల సౌకర్యార్ధం జూన్ 12వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుండి తిరుమలలోని ఆరు ప్రాంతాల్లో నూతనంగా టిటిడి ఏర్పాటు చేసిన కౌంటర్లలో వసతి గదుల కొరకు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని టిటిడి కల్పిస్తోంది. ఇప్పటి వరకు తిరుమలలోని వసతి కొరకు సిఆర్‌వో వద్ద పేర్లు రిజిస్ట్రేషన్ మరియు గదులు కేటాయిస్తున్న విషయం విదితమే. శనివారం నుండి జిఎన్‌సి టోల్‌గేట్ వద్ద ఉన్న లగేజి కౌంటర్ నందు రెండు కౌంటర్లు, బాలాజి మెయిన్ బస్టాండ్ వద్ద రెండు కౌంటర్లు, కౌస్తుభం అతిథి భవనం వద్ద ఉన్న కారు పార్కింగ్ ప్రాంతంలో రెండు కౌంటర్లు, రాంభగిచ బస్టాండ్ వద్ద రెండు కౌంటర్లు, ఎమ్‌బిసి ప్రాంతంలోని శ్రీవారి మెట్టు వద్ద రెండు కౌంటర్లు, సిఆర్‌వో వద్ద రెండు కౌంటర్లలో భక్తులు వసతి కోరకు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న భక్తులకు ఎస్ ఎమ్ ఎస్ ద్వారా వారికి కేటాయించిన గదుల సమాచారం తెలియజేయబడుతుంది. అనంతరం వారికి గదులు కేటాయించిన ప్రాంతాల్లోని ఉప విచారణ కార్యాలయాల వద్ద రుసుం చెల్లించి గదులు పొందవచ్చు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# హంగులు దిద్దుకున్న వైజాగ్ ఎయిర్‌పోర్టు

విశాఖపట్టణం, జూన్ 10, :విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం.. ఇండియన్ నేవీ విమానాశ్రయం ఐఎన్ఎస్ డేగాలో పౌర విమానయాన సేవలందిస్తోంది. మొత్తం 349.39 ఎకరాల విస్తీర్ణంలో విమానాశ్రయం విస్తరించి ఉంది. దేశంలో ఎక్కడా లేని ఒక ప్రత్యేకమైన గుర్తింపు విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉంది.సాధారణంగా దాదాపు ప్రతి విమానాశ్రయంలోనూ రన్‌వేకు రెండు వైపుల నుంచి టేకాఫ్, ల్యాండింగ్స్ జరుగుతుంటాయి. కానీ విశాఖలో మాత్రం విమానాశ్రయానికి ఒకవైపు పెద్ద కొండ ఉండటం వల్ల ఒకవైపు నుంచి మాత్రమే రాకపోకలు సాగుతున్నాయి. 1981లో రోజుకు ఒక విమానం ద్వారా ప్రారంభమైన పౌర సేవలు ప్రస్తుతం సుమారు 70 వరకు చేరుకున్నాయి. అయితే కోవిడ్ కారణంగా కేవలం 14 సర్వీసులు మాత్రమే ప్రస్తుతం నడుస్తున్నాయి. భవిష్యత్తులో రాకపోకలు పెంచేందుకు విస్తరణ పనులు చేపట్టారు. బ్రిటీష్ కాలంలో 4 పార్కింగ్ బేస్ ఉండేవి. తరువాత మరో 6 పార్కింగ్ బేస్‌లు నిర్మించారు. గతంలో ఉండే రన్‌వే వినియోగించే అవకాశం లేదు. ఇప్పుడు ఒకే రన్‌వే ఉంది. దాన్ని నేవీతో సంయుక్తంగా వినియోగిస్తున్నారు. రన్‌వేపై వెళ్లేందుకు ఎవరికీ అనుమతి లేదు. నేవీ టవర్ కంట్రోల్ రూమ్‌తో రన్‌వేను అనుసంధానం చేశారు. ఎవరైనా రన్‌వే పైకి వెళ్లాలంటే రక్షణ దళ అనుమతి తప్పనిసరి. యాప్రాన్, హ్యాంగర్స్, టెర్మినల్‌కు రన్‌వేలో ఉన్న విమానంతో అనుసంధానమయ్యేలా ఉండే ట్యాక్సీ వేలు కూడా నేవీ భాగంలోనే ఉన్నాయి. అందుకే ప్రత్యేకంగా మరో కొత్త ట్యాక్సీ ట్రాక్ నిర్మించారు. దీనికితోడు తాజాగా మరో ఆరు పార్కింగ్ బేస్‌ల నిర్మాణం కూడా పూర్తయింది. ఇవి త్వరలోనే ప్రారంభించనున్నారు. ఇవి కూడా అందుబాటులోకి వస్తే మొత్తం 16 విమానాలు ఏక కాలంలో రాకపోకలు సాగించే అవకాశాలున్నాయి.అంతర్జాతీయ స్థాయి సదస్సులకు వేదికగా విశాఖ నిలుస్తోంది. దీనికితోడు రాష్ట్ర కార్యనిర్వాహక రాజధానిగా కొత్త రూపుదాల్చనుంది. దీనికితోడు కొత్త రైల్వే జోన్, పోర్టులు, జలరవాణా, జాతీయ రహదారులు ఇలా విశిష్ట సామర్థ్యమున్న విశాఖకు కాలానుగుణంగా కనెక్టివిటీ పెరగాల్సి ఉంది. అయితే నేవీ ఇచ్చిన స్లాట్స్ ప్రకారం 85 విమానాల కంటే ఎక్కువ నడపలేని పరిస్థితి ఉంది. ఈ స్లాట్ పెరగాలంటే.. లిమిటేషన్ పెంచాలి. అది పెరగాలంటే రన్‌వే హ్యాండ్లింగ్ కెపాసిటీ పెంచాలి, ఆక్యుపేషన్ టైమ్ తగ్గించాలి. రన్‌వే ఎఫిషియన్సీ పెంచాలి. ఇది పెరిగితే ప్రస్తుతం ఉన్న గంటకు 10 రాకపోకల స్లాట్‌లో పాసింజర్ విమానాల సామర్థ్యం 16కి పెరుగుతుంది.రన్‌వే హ్యాండ్లింగ్ పెరిగి, ఆక్యుపెన్సీ తగ్గి 50 శాతం పెరిగితే ప్రస్తుతం ఉన్న 85 విమానాల రాకపోకల కెపాసిటీ 123కు చేరుకుంటుంది. దీనివల్ల ఇతర ప్రాంతాలకూ కనెక్టివిటీ ఫ్లైట్స్ పెరుగుతుంది. అప్పుడు ఇతర నగరాలకు రాకపోకలు విస్తరించవచ్చు. డిమాండ్ ఉన్న సమయాల్లో మరిన్ని ఫ్లైట్స్‌కు స్లాట్స్ కేటాయించవచ్చు. ట్యాక్సీ ట్రాక్‌లు పెంచినప్పుడు ల్యాండింగ్ అయ్యే విమానాలు.. వెంట వెంటనే వచ్చి వెళ్లిపోయే అవకాశముంది. దీని వల్ల రన్‌వేపై ఆక్యుపెన్సీ టైమ్ తగ్గుతుంది. దీనివల్ల స్లాట్ సామర్థ్యం మరింత పెరిగి పాసింజర్ ఫ్లైట్స్ పెరగవచ్చు. కొత్త ట్యాక్సీట్రాక్ నిర్మాణం పూర్తి కావడంతో దీనికి మార్గం సుగమమైం

# భారీగా ఆస్తి పన్ను బాదుడు

విజయవాడ, జూన్ 10, :ఆంధ్రప్రదేశ్‌లో ఆస్తి పన్ను పెంపు ఇప్పుడు కలకలం రేపుతోంది. ప్రభుత్వ వర్గాలు మంత్రి బొత్స సత్యనారాయణ లాంటివాళ్లు ఆస్తి పన్నును 0.15 శాతం మాత్రమే పెంచుతున్నామని దీనికి ఇంత రగడ ఎందుకని ప్రశ్నిస్తున్నాయి. కానీ ఇక్కడ విషయం 0.15 శాతం పెంపు కాదు. మొత్తం ఆస్తి విలువలో ఆస్తి పన్నును ఏటా 0.15 శాతం వసూలు చేస్తారు. ప్రతీ ఏటా ఆస్తి విలువ పెంచుతుంటాంటారు. అంటే.. ఈ 0.15 అలాగే ఉంటుంది. కానీ పన్ను మాత్రం పెరుగుతూ ఉంటుంది. ఇప్పుడీ పన్నులు.. ప్రజల్లో చర్చనీయాంశం అవుతున్నాయి. కేంద్రం ఇచ్చేరుణాల కోసం సంస్కరణలు అమలు చేస్తున్నఏపీ పట్టణ ప్రజలపై పన్నులు పెంచేందుకు కూడా అంగీకరించింది. అందులో భాగంగా ఆస్తి విలువలో 0.15 శాత పన్నును విధించాలని నిర్ణయించింది. ఎన్నికల సమయంలో నిర్ణయాన్ని వాయిదా వేసిన ప్రభుత్వం.. ఇప్పుడు.. అన్ని చోట్లా అమలు ప్రారంభించింది. ఎక్కడికక్కడ నోటిఫికేషన్లు ఇస్తున్నారు. నోటిఫికేషన్ లో నివాస గృహాలపై ఆస్తి విలువపై 0.15 శాతం, వాణిజ్య, నివాసేతర భవనాలపై 0.3 శాతం, ఖాళీ స్థలాలపై 0.5 శాతం పన్ను వేస్తారు. ఆస్తి మూలధన విలువలో 0.15 శాతం పన్ను విధిస్తారు అంటే ? ఆ ఆస్తి ముప్పై ఏళ్ల క్రితం కొనుగోలు చేసినప్పటికీ.. ఇప్పుడు ఉన్న విలువ ఆధారంగా పన్ను నిర్ణయిస్తారన్నమాట. ఉదాహరణకు విశాఖలో ఓ వ్యక్తి 30 ఏళ్ల కిందట..ఓ వ్యక్తి 30వేలు పెట్టి ఇల్లు స్థలం కొనుక్కున్నారనుకుంది. ఇప్పుడు ఆ స్థలం విలువ మూడు కోట్లు అయి ఉంటుంది. అందులో ఇల్లు ఉంటే 0.15 శాతం.. ఖాళీ స్థలమే అయితే 0.5 శాతం పన్ను కట్టాలి. మూడు కోట్ల స్థలానికి పన్ను యాభై వేలు అన్నమాట. ఇంటికి వచ్చేసరికి వేరే లెక్క ఉంటుంది. అందులో కట్టిన చదరపు అడుగుల వారీగా లెక్క వేసి.. ఇప్పటి విలువను లెక్కించి మరీ.. పన్నువసూలుచేస్తారు. అంటే ప్రస్తుతం ఉన్న పన్ను.. దాదాపుగా పది రెట్లు పెరుగుతుంది. రూ. వెయ్యి కట్టే వారు.. పదివేలు కట్టాల్సి ఉంటుంది. ఈ విధానంలో ప్రభుత్వం డబ్బులు కావాల్సినప్పుడల్లా భూములు, కట్టడాల విలువను పెంచుకుంటూపోతే చాలు ప్రజల నుంచి కావాల్సినంత ఇంటి పన్ను పిండుకోవచ్చు. ఇప్పటికే ప్రతి ఏటా భూముల రేట్లు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఏపీలో ఆస్తి ఉన్న ప్రజలు.. అది గ్రామమైనా పట్టణమైనా.. నగరమైనా.. పన్నులు పది రెట్లు ఎక్కువగా కట్టడానికి సిద్ధపడాల్సిందే.

# కంచుకోటకు బీటలు




ఏలూరు, జూన్ 10, :పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. ఆ పార్టీ ఆవిర్భావించక ఇక్కడ ఒక్కసారే ఓటమి పాలైంది. 1983 నుంచి 2019 వరకు చూసుకుంటే టీడీపీ కేవలం 2004 ఎన్నికల్లోనే ఓడిపోయింది. మిగిలిన 8 సార్లు ఉండి నియోజకవర్గంలో టీడీపీ జెండానే ఎగిరింది. రాష్ట్రంలో జగన్ గాలి బలంగా ఉన్నా సరే 2019 ఎన్నికల్లో ఉండిలో మాత్రం టీడీపీ గెలిచింది. దీనిని బట్టే ఉండి టీడీపీ ఎంత కంచుకోటో తెలుస్తోంది. వైఎస్ ప్రభంజనం అయినా.. జగన్ సునామీ అయినా ఉండిలో సైకిల్ సత్తా చెక్కు చెదర్లేదు. ఇక్కడ గత ఎన్నికల్లో టీడీపీ తరపున మంతెన రామరాజు విజయం సాధించారు. అయితే తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన రాంబాబు, కాస్త సైలెంట్‌గానే పనిచేసుకుంటూ వెళుతున్నారు. నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులోనే ఉంటున్నారు.అదే సమయంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉంటూ, అధికార వైసీపీపై దూకుడుగా వెళ్ళడం లేదు. ఇటు టీడీపీలో ఉంటూనే, అటు వైసీపీతో కూడా మంచిగానే ఉంటున్నారు. ప్రభుత్వంపై దూకుడుగా విమర్శలు చేయడం లేదు. నియోజకవర్గంలో పనులు చేయించుకోవడానికి జిల్లాలోని వైసీపీ నేతలతో సఖ్యతతోనే ఉంటున్నారన్న ప్రచారం స్థానికంగా టీడీపీ వర్గాల్లోనే వినిపిస్తోంది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఇస్తామని టీడీపీ ఆఫర్ చేయడంతో ఆర్థికంగా భారీ రిస్క్ చేసే రాంబాబు గెలిచారు. అయితే ఇప్పుడు ప్రభుత్వంతో సై అనేలా వ్యవహరిస్తే ఆయన వ్యాపారాలకు కూడా పెద్ద రిస్కే అన్న నిర్ణయానికి ఆయనే వచ్చేశారట.జిల్లాలో తన సామాజిక వర్గానికే చెందిన మంత్రి రంగరాజుతో లోపాయికారిగా సఖ్యతతో ఉంటున్నట్టు కూడా వార్తలు గుప్పుమంటున్నాయి. అయితే ఇలా కర్ర విరగకూడదు?పాము చావు కూడదు అన్న చందంగా నడుస్తున్న రాంబాబుకు నెక్ట్స్ ఎన్నికల్లో ఉండి సీటు దక్కుతుందా లేదా అనేది కాస్త డౌట్‌గానే ఉంది. ఎందుకంటే 2009, 2014 ఎన్నికల్లో ఉండి నుంచి వేటుకూరి శివరామరాజు(కలవపూడి శివ) టీడీపీ తరుపున గెలిచారు. ఇక 2019 ఎన్నికల్లో రాజకీయ సమీకరణాల్లో భాగంగా చంద్రబాబు, శివని నరసాపురం ఎంపీగా బరిలో దించారు. ఇక శివకు సోదరుడు వరుసయ్యే రాంబాబుని ఉండిలో నిలబెట్టారు.ఇక జగన్ వేవ్‌లో శివ ఓటమి పాలయ్యారు. ఈయనపై రఘురామకృష్ణంరాజు విజయం సాధించారు. అయితే ఓడిపోయిన దగ్గర నుంచి శివ పొలిటికల్ స్క్రీన్‌పై కనిపించడం లేదు. సొంత వ్యాపారాలు ఉండటంతో సైలెంట్‌గా ఉంటున్నట్లు తెలుస్తోంది. అయితే వచ్చే ఎన్నికల్లో శివ మళ్ళీ ఉండి నియోజకవర్గం నుంచి టీడీపీ తరుపున ఎమ్మెల్యేగానే పోటీ చేస్తానని చెప్పేశారని తెలుస్తోంది. శివకు మళ్ళీ నరసాపురం నుంచి పోటీ చేసే ఉద్దేశం లేదన్నది క్లారిటీ వచ్చేసింది. శివ వస్తే రాంబాబు సైడ్ అవ్వాల్సిందే. మరి చంద్రబాబు ఆ ఇద్దరి నేతలకు ఎలా న్యాయం చేస్తారో చూడాలి. ఏదేమైనా ఉండి టీడీపీలో ఈ ఇద్దరు నేతల రాజకీయం కొత్తగా మారేలా కనిపిస్తోంది.


## పూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)

అంబేడ్కర్ రాజనీతి మూవ్‌మెంట్ (ARM)
(A Unit of JAC Regn. No. 1047 of 2016)
Central Office: # 6-2-29/3/12, 3rd Floor, Doublat Plaza, Lakdi-Ka-Pool, Hyderabad - 500 004
https://ambedkarrajaneethi.com E-mail : ambedkarrajaneethimovement@gmail.com

### ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి

బహుజన మిత్రులారా !
జై భీమ్

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74 సంవత్సరాలు అయినప్పటికీ 85% బహుజనుల సమస్యలు సమస్యలుగానే ఉంటున్నాయి.

అత్యధిక జనాభా కలిగి ఉన్న బహుజనులు కూడా, బహుజన సమస్యలను మెమోరాండం ద్వారానే ప్రభుత్వాలను అడుక్కుంటునారు. సమస్యలు అర్థం కాని అల్పసంఖ్యాక ఆధిపత్యకులాలు ఈ దేశాన్ని ఏలుతున్నారు. మన దేశాభివృద్ధి జరగాలంటే సమస్యలకు పరిష్కారం తెలిసిన బహుజనులు, పూలే పోరాట పటిమతో బాబాసాహెబ్ డా॥ అంబేడ్కర్‌గారు రాజ్యంగం ద్వారా కల్పించిన హక్కులతో ఒకరి సమస్యను ఒకరు సమర్థించు కుంటూ చేయి చేయి కలిపి ముందుకు సాధిద్దాం. బహుజన కులాల మధ్య అంతరాలను తొలిగించి సభ్యత్వాలను పెంపొందిస్తూ బహుజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకొందాం.

సమ సమాజ స్థాపనకు ఈ సామాజిక ఉద్యమంలో లక్షలాది మంది మెంబర్స్‌గా చేరడం వల్ల మన సమస్యలను మనమే పరిష్కరించుకోవడమే కాకుండా బహుజన రాజ్యాధికారం వైపు నడిపించగలము.

### ప్రధాన ఆశయాలు

సమసమాజ స్థాపనకు పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS) అశయాల పట్ల అవగహన కల్పించడానికి రండి కదలి రండి.

1. బహుజన సమస్యలను సంవత్సరాల తరబడి పరిష్కారం కాకుండా పేద వాడిని ఇంకా పేదవాడుగా.... గుడిసెలను ఇంకా పూరిగుడిసెలుగా... మురికి వాడలను ఇంకా మురికి కుపాలుగా చేస్తూ.. అల్ప సంఖ్యాక ఆధిపత్య కులాలు పరిపాలిస్తున్నారు. అందువల్ల దేశాభివృద్ధి కావాలంటే సమస్యలను పరిష్కరించే సత్తా ఉన్న అత్యధిక జనాభా కలిగిన బీసీలను ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలనేది ప్రతిపాదన.
2. మహిళలను అబలలుగా ఈ సమాజం చిత్రీకరిస్తుంది. కాబట్టి అబల కాదు సబల అని నిరూపించడానికి అన్ని రంగాల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదిస్తుంది.
3. ఏ కులం సమస్యలు ఆ కులం వారికే తెలుస్తాయి. కానీ 40 లక్షల జనాభా ఉన్న కులాలు ఇంకా అసెంబ్లీ మెట్లు ఎక్కలేదు. కాబట్టి 5 లక్షల జనాభా ఉన్న ప్రతి కులం నుండి నాయకులను అసెంబ్లీకి ఎమ్మెల్యేలుగా పంపాలని ప్రతిపాదన.
4. రిజర్వేషన్ల వల్ల రాష్ట్రం నాశనం అవుతుందని కొంతమంది అల్ప సంఖ్యాకులయిన పాలక కులాల వారు బాధపడుతున్నారు. అందువల్ల భారత రత్న బాబా సాహెబ్ డా॥ బి.ఆర్. అంబేడ్కర్ గారు భారత రాజ్యంగ పీఠికలో ప్రతిపాదించిన సమానత్వ సిద్ధాంతం ప్రకారం రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ మీరెంతో మీకంత (మీ జనాభా ఎంతో మీకంత రిజర్వేషన్) అని ప్రతిపాదిస్తుంది.
5. డా॥ బి.ఆర్. అంబేడ్కర్ గారు ప్రతిపాదించిన విధంగా ముస్లీం, క్రిస్టియన్, ఎస్సీ, ఎస్టీ, బుద్దిస్టులకు సేపరేట్ ఎలక్ట్రోరేట్ (ప్రత్యేక నియోజక వర్గాలు) అవసరమని ప్రతిపాదిస్తుంది.

ఈ ప్రతిపాదనలలో ఏ ఒక్కప్రతిపాదనను అంగీకరించినా... వారు ప్రతి ఒక్కరూ వారి వారి కుటుంబ సభ్యులతో సహా www.ambedkarrajaneethi.com వెబ్సైట్ ద్వారా సభ్యులుగా చేరి ఆశయ సాధనకు మద్దతు తెలిపి, బహుజన ఆత్మగౌరవాన్ని పరిరక్షించు కునేందుకు రండి.. కదలి రండి...

### కమిటీల నిర్మాణం

రెండు తెలుగు రాష్ట్రాలలో రాష్ట్ర, జోనల్, పార్లమెంట్, అసెంబ్లీ, మండల స్థాయిలలో కమిటీల నిర్మాణం జరుగుతుంది.
ప్రతి కమిటీలో కనీసం 21 మంది లేదా అంతకంటే ఎక్కువమంది సభ్యులుగా ఉంటారు.
అదేవిధంగా ప్రతి కమిటీలో కనీసం 7 కులాలనుండి లేదా అంతకంటే ఎక్కువ కులాల నుండి ప్రాతినిధ్యం కలిగివుంటుంది

### ఆశయాలు

ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి

1. చట్టపరమైన రిజర్వేషన్స్ అమలుకు నోడల్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయుట.
2. ప్రైవేట్ రంగంలో నడిచే అన్ని సంస్థలలో రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయుట, వాటి వివరాలను సంస్థ నోటీస్ బోర్డులలో పెట్టి సమాచార హక్కు చట్టం (RTI ACT) పరిధిలో ఉంచుట.
3. కులనిర్మూలనలో భాగంగా జనాభా గణనలో "సమతా కులం" అనే పేరు మీద ఒక కొత్త కులాన్ని చేర్చి, వారికి ఆర్థిక, సామాజిక రంగాలలో ప్రాధాన్యతను ఇస్తూ, కులాంతర వివాహం చేసుకున్నవారికి ప్రాణ, ఆస్తి, సామాజిక రక్షణ కల్పించడానికి బాధ్యత వహించడం. కులనిర్మూలన కోసం "సమతా కులమే" ఏకైక కులంగా ఉంచుట.
4. నిరుద్యోగ నిర్మూలన కొరకు 7వ తరగతి నుండి పిజి చేసిన ప్రతి నిరుద్యోగులకు వారికి ఇష్టమైన ఉద్యోగ, వ్యాపార రంగాలలో స్టైఫండ్‌తో కూడిన శిక్షణ అవకాశాలను కల్పించుట.
5. అన్ని ప్రభుత్వ పాఠశాలలను, రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చి, అందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించుట.
6. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరను ముందుగానే ప్రకటిస్తూ, విపత్కర పరిస్థితుల్లో కౌలు రైతు / రైతుకు నష్టపరిహారం చెల్లించుట.
7. భూమి లేని రైతులందరికి నాలుగు ఎకరాల భూమి ఇచ్చుట
8. భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో ప్రతిపౌరుడిని భాగస్వామిగా చేస్తూ దేశం వదిలి పారిపోని బహుజనులకు వారి వ్యాపార వ్యవసాయ రంగాలకు గాను రూ. 2,00,000/- (అక్షరాలా రెండు లక్షల రూపాయలను) హామి లేని ఋణాన్ని కేవలం ఆధార్ కార్డు ఆధారంగానే ఇచ్చి, చెల్లింపులనంతరం రెట్టింపు ఋణాలిచ్చి ప్రోత్సాహించుట.
9. రాష్ట్ర ముఖ్యమంత్రి నుండి చిరు ఉద్యోగి వరకు అందరూ విధిగా ప్రభుత్వా ఆసుపత్రిలోనే చికిత్స చేయించుకొనుట.
10. ప్రతి పూరిగుడిసెను విశాలమైన వీధులలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పక్కా గృహాలను నిర్మించుట.
11. అన్ని సమస్యలకు మూలకారణం అయిన "మద్యపానాన్ని" పూర్తిగా నిషేదించుట.
12. మతం మారినా కులం మరాదు కాబట్టి రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను ఎస్సీలకు వర్తింపచేయుట.
13. కార్మికులకు, కర్షకులకు, వలస కూలీలకు, వ్యవసాయ కూలీలకు, రూ. 50,00,000/- విధిగా జీవిత భీమాను కల్పించుట.
14. కుటీర పరిశ్రమలను పెట్టాలనే ఆసక్తివున్నవారికి మౌళిక వసతులు కల్పించి, వాటిని అద్దెకిచ్చి వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించుట.
15. భూమిలేని ముస్లింలకు, కిష్టియన్‌లకు మరియు హిందువులకు ఆయా సంస్థల ఆధీనంలో గల భూములను పంచుట.
16. దేవాదాయ భూములను, భూమిలేని పేద రైతులకు కౌలుకు ఇచ్చుట.
17. రాష్ట్ర పోలీస్ వ్యవస్థను ఒక ప్రత్యేక సంస్థగా రూపొందించుట.
18. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి నమోదైన ప్రతి ఒక ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా కు చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ప్రపోర్షనేట్‌గా ప్రభుత్వ అడ్వర్టైజ్‌మెంట్స్‌ను ఇచ్చి ప్రోత్సాహించుట.
19. రాజకీయ, వ్యాపార, ఉద్యోగ రంగాలలో లంచం ఇచ్చే అవినీతి పరులను పాము కంటే విషపూరితమైన వ్యక్తిగా భావించుట.
20. ఎన్నికల్లో డబ్బులు పంచే వ్యక్తులను, ఆయా కుటుంబాలను ఎన్నికల్లో పోటి చేయకుండా, పోటీకి అనర్హులుగా ప్రకటించుట. రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ రద్దు చేయుట.

### అసక్తి ఉన్నవారు సంప్రదించగలరు

**ఆంధ్రప్రదేశ్**
డా॥ ప్రత్యూష సుబ్బారావు కన్వీనర్, 9030644440
డా॥ పి. పరమ శివన్, 9440077239
నమ్మి అప్పారావు 9440137451
అమిరిశెట్టి శ్రీధర్ 9491664469
దేవి 9394668555
యం. కమలాకర్ రావు, 9393921011
సొంటి నాగరాజు, 9959488555
కె. హనుమంత్‌రావు ముదిరాజ్ 9392004473
అనుశ్చచంద్ర ప్రసాద్ 7989747376

**తెలంగాణ**
మల్లెల రామనాథం, 9346939481
అరెపల్లి రాజేందర్, 9440918371
డా॥ గుండు కిష్టయ్య ముదిరాజ్, 9948335870
నాగుల శ్రీనివాస్ యాదవ్, 9849170810
లాల్ కృష్ణ ప్రసాద్, 9949479292
రమ్య కురుమ,
ఉప్పు సత్యనారాయణ, 8688300704
డి. గోవర్ధన్, 9963300551

Central Working Committee Members :
జె.బి. రాజు బహుజన IIS-vrs, నిశాంత్ బహుజన
డా॥ గూడూరు సీతామహాలక్ష్మి 8008840506
గుంజి నరసింహ రావు 7995914086
దూలపల్లి వాణి 8019033885
నేషనల్ కన్వీనర్ డా॥ కె. శివభాగ్యారావు బహుజన IRS-vrs
జై భీమ్... జై పూలే... జై భారత్



# ప్రత్యర్థులను అలా చెంప దెబ్బ కొట్టిన ఎన్టీఆర్



నందమూరి కుటుంబ హీరోల నడుమ కలతల గురించి రకరకాల సందర్భాల్లో చర్చ సాగింది. ఇక తెలుగు దేశం పార్టీ(టీడీపీ)ని ముందుకు నడిపించే సత్తా జూనియర్ ఎన్టీఆర్ కు మాత్రమే ఉందని ఓ సెక్షన్ మీడియా కథనాలు వైరల్ అయిన సంగతి తెలిసినదే.నారా కుటుంబానికి నందమూరి కుటుంబానికి ఎదురెళ్లి యంగ్ టైగర్ ఎన్టీఆర్ సొంతంగా పార్టీని ప్రారంభిస్తారని ప్రచారమవుతోంది. ఇప్పటికీ ఎప్పటికీ అన్ లిమిటెడ్ గా దీనిపై చర్చ సాగుతూనే ఉంటుంది. కానీ యంగ్ టైగర్ ఎన్టీఆర్ తాజాగా చేసిన ఓ పని ప్రత్యర్థులను తీవ్రంగా నిరాశకు గురి చేసింది.గురువారం ఉదయం 8:26 గంటలకు యంగ్ టైగర్ ఎన్టీఆర్ ట్విట్టర్ లో నందమూరి బాలకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఒక అందమైన ఫోటోతో విషెస్ ని పోస్ట్ చేశారు. ఈ ట్వీట్ తక్షణమే వైరల్ అయ్యింది. లక్షలాది మందిలోకి దూసుకెళ్లింది. బాబాయ్ బాలయ్యపై అబ్బాయ్ రామారావు అభిమానం ప్రతిసారీ బయటపడుతూనే ఉంది. అది గౌరవం భక్తి భయంతో కూడుకున్నది అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ ఆ ఇద్దరి మధ్యా డిఫరెన్సెస్ అంటూ ప్రచారం మాత్రం ఆగదు.ఇటీవల రకరకాల సందర్భాల్లో కళ్యాణ్ రామ్ -తారక్ బ్రదర్స్ తమపై సాగేదంతా తప్పుడు ప్రచారం అని ప్రూవ్ చేసేందుకు ప్రయత్నించారు. బాబాయ్ బాలకృష్ణతో ఎలాంటి పొరపొచ్చాలు లేవని నిరూపిస్తూ భయం భక్తిని కనబరిచారు. టీడీపీకి నేను దూరం కాదు.. కానీ రాజకీయాల్లోకి రాను! అనే బలమైన సందేశాన్ని ప్రజల్లోకి పంపేందుకు తారక్ చేయని ప్రయత్నం లేదు. అందుకే బాలయ్యకు ఎన్టీఆర్ బర్త్ డే విషెస్ చాలామందిని నిరాశపరిచి ఉండొచ్చు అంటూ టాక్ వినిపిస్తోంది. బాలయ్య పుట్టినరోజు సందర్భంగా అఖండ కొత్త పోస్టర్ 107 ని రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. బాలయ్య లుక్ పై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. మరోవైపు ఇండస్ట్రీలో ఇతర స్టార్లలో మెగాస్టార్ చిరంజీవి.. సూపర్ స్టార్ మహేష్ సహా పలువురు స్టార్లు ఎన్బీకేకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## రంగుల వలయంలో చిక్కుకుపోయిన పాయల్!!



తనదైన అందం వేడెక్కించే నటనతో కుర్రాళ్లను తన గాలానికి చుట్టేసి ఒక వింతైన వలయంలో చిక్కుకునేలా చేసింది పాయల్ రాజ్ పుత్. ఈ పంజాబీ బ్యూటీ కి ఇటీవల టాలీవుడ్ లో పెద్దగా ఆఫర్లు దక్కకపోయినా తెలివిగా ద్వితీయ శ్రేణి ఆఫర్లను దక్కించుకుంటోంది. అటు తమిళం పంజాబీలోనూ నటిస్తూ బిజీగా ఉంది. ఇరుగు పొరుగు పరిశ్రమల్ని ఆకర్షించేందుకు వరుస ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది.తాజాగా పాయల్ షేర్ చేసిన ఓ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఇది కాన్సెప్ట్ బేస్డ్ ఫోటోషూట్.. కళాత్మకంగా డిజైన్ చేసినది. నగరం ఔట్ స్కర్ట్స్ లో ఒక నిర్మాణంలో ఉన్న తూము (సిమెంట్ వలయం)లో పాయల్ ఇలా డిజైనర్ లుక్ తో కనిపించింది. ఇక తన డ్రెస్ ని గ్రాఫిటీ కలర్స్ తో మిక్స్ చేసిన తీరు ఆసక్తికరం.అల్లంత దూరంగా కనిపిస్తున్న పైప్ లైన్ కి బ్లూ కలర్ ని అద్ది.. వలయంలోనూ థిన్ లైన్ అంచుకు బ్లూ షేడ్ ఇచ్చి ఎంతో కాన్సెప్ట్యువల్ గా ఈ ఫోటోషూట్ ని తీర్చిదిద్దిన వైనం ఆకర్షించింది. ఇక పాయల్ అందచందాల గురించి చెప్పాల్సిన పనే లేదు. ఆ పొట్టి ఫ్రాకులో పాయల్ ఎంతో క్యూట్ గా లవ్ లీగా కనిపిస్తోంది. అలా థై సొగసుల ఎలివేషన్ హాట్ నెస్ ని పెంచింది. అన్నట్టు ఆర్.ఎక్స్ 100 దర్శకుడితో పాయల్ మరో సినిమా చేస్తోందని ప్రచారమైంది. దానికి సంబంధించిన అప్ డేట్ ఇంకా రావాల్సి ఉంది. కోలీవుడ్ లో ఉదయనిధి స్టాలిన్ సరసన యాంజెల్ అనే చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. కోవిడ్ వల్ల చిత్రీకరణ ఆలస్యమవుతోంది.

## ఫైనాన్స్ గొడవలో హీరోపై నిర్మాత వ్యంగ్యం



ఓ సినిమా ఆర్థిక వ్యవహారాల విషయంలో తేడా రావడంతో నిర్మాత కం ఫైనాన్షియర్ ఆర్.బి.చౌందరిపై హీరో విశాల్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. సదరు ఫైనాన్షియర్ కం సీనియర్ నిర్మాత నుండి రుణం తీసుకునేటప్పుడు తాను సమర్పించిన పత్రాలను తప్పుగా చూపిస్తున్నారనేది విశాల్ ఆరోపణ. అయితే ఇదంతా వెర్రి వ్యవహారం అంటూ కొట్టి పారేసారు ఆర్బీ చౌదరి.అప్పు తీసుకునేటప్పుడు విశాల్ తనకు అన్ని పత్రాలను సమర్పించినట్లు ఆర్.బి.చౌదరి చెబుతున్నారు. తిరుప్పూర్ సుబ్రమణియన్ - ఆర్బి చౌదరి సంయుక్తంగా విశాల్ కు రుణ మొత్తాన్ని ఇచ్చారు. ఆయుధ పూజై దర్శకుడు శివకుమార్ ఈ ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించి పత్రాలను సిద్ధం చేశారు. కానీ శివకుమార్ గుండెపోటుతో ఇటీవల కన్నుమూయడంతో ఆ తరువాత తమ వద్ద పత్రాలు దొరకలేదని ఆర్బి చౌదరి ఒక మీడియాకు తెలిపారు.పెండింగ్ క్లియరైందని రాతపూర్వక పత్రం ఇచ్చినా విశాల్ భయపడుతున్నారు.. నేను చెన్నైకి తిరిగి వచ్చాక సమస్యను పరిష్కరిస్తాను!! అని ఆర్బీ చౌదరి అన్నారు. ఆర్.బి. చౌదరి సీనియర్ నిర్మాత కం ఫైనాన్షియర్. తెలుగు-తమిళంలో చాలా భారీ చిత్రాల్ని నిర్మించారు. మెగా కాంపౌండ్ కి ఆయన ఎంతో సన్నిహితుడు. ఆర్బీ చౌదరి వారసుడు జీవా రంగం సినిమాతో తెలుగు వారికి సుపరిచితం. జీవా ప్రస్తుతం తమిళంలో నటిస్తున్నారు.

# 'బాలీవుడ్'లోకి టాలీవుడ్ స్టార్ ..?



ప్రస్తుతం దక్షిణాది చిత్రపరిశ్రమలో మోస్ట్ వాంటెడ్ మేల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ఎవరంటే.. జగపతి బాబు పేరే మొదటిగా వినిపిస్తుంది. ఎందుకంటే చైల్డ్ ఆర్టిస్ట్ నుండి హీరోగా సిల్వర్ స్క్రీన్ పై అడుగు పెట్టిన జగ్గుభాయ్.. ఫ్యామిలీ హీరోగా విపరీతమైన లేడీ ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. మొదట్లో స్టార్ హీరోగా సినిమాలు చేసిన ఆయన ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా బిజీ లైఫ్ ఎంజాయ్ చేస్తున్నాడు. ఎలాంటి వేషమైనా ఇట్టే మెప్పించగల జగ్గుభాయ్.. త్వరలోనే బాలీవుడ్ సినిమాలో మెరిసేందుకు సిద్ధమవుతున్నాడు. ఇప్పుడు ఉన్నటువంటి జనరేషన్ స్పీడ్ చూసాక ఒక దశలో అవకాశాలు లేక ఇబ్బందిపడ్డట్టు తెలిపిన జగ్గుభాయ్ ఇప్పుడు మోస్ట్ బిజీ ఆర్టిస్ట్ అయిపోయాడు.బోయపాటి దర్శకత్వంలో లెజెండ్ సినిమాతో విలన్గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన జగ్గూభాయ్.. అప్పటినుండి వెనక్కి తిరిగి చూసుకోలేదు. లెజెండ్ తర్వాత విలన్గా క్యారెక్టర్ ఆర్టిస్ట్గా సౌత్లో ఫుల్ బిజీ అయిపోయాడు. అయితే సౌత్ లో ఏ భాష నుండి ఆఫర్ వచ్చినా జగ్గుభాయ్ ఎల్లప్పుడూ సిద్ధమే అంటున్నాడు. అందుకే తమిళ మలయాళం కన్నడ తెలుగు అనే తేడాలేకుండా వరుసగా చేసుకుంటూ పోతున్నాడు. కానీ తాజాగా జగ్గుభాయ్ పేరు బాలీవుడ్ లో మారుమోగనుందా అంటే అవుననే అంటున్నాయి సినీవర్గాలు. ఎందుకంటే ఇటీవలే బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ నుండి పిలుపు వచ్చిందట.అయితే ఆ సినిమాలో జగపతిబాబును విలన్ గా ఎంపిక చేసినట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మరి ఇంతకీ బాలీవుడ్ సినిమా ఓకే అయిందో లేదో తెలియదు కానీ జగ్గుభాయ్ క్యారెక్టర్ పై మాత్రం రూమర్స్ హల్చల్ చేస్తున్నాయి. బాలీవుడ్ వర్గాలు విలన్ రోల్ అంటుండగా.. టాలీవుడ్ వర్గాలలో హీరో తండ్రి క్యారెక్టర్ చేయనున్నట్లు టాక్ నడుస్తుంది. ప్రస్తుతం బాలీవుడ్ హీరోలు కూడా సౌత్ స్టార్స్ పై దృష్టి పెడుతున్నారు. అందుకే ఒక్కో సినిమాలో ఒక్కో సౌత్ స్టార్ కనిపిస్తున్నారు. ఇటీవలే అమీర్ ఖాన్ సినిమాలో నాగచైతన్య ఛాన్స్ అందుకున్నాడు. ఇప్పుడు జగ్గుభాయ్ పేరు వినిపించే సరికి ఈ వార్తలపై ప్రేక్షకులలో ఆసక్తి నెలకొంది. అయితే సినిమా ఏంటి.. దర్శక నిర్మాతలు ఎవరు అనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం జగ్గుభాయ్ చేతినిండా సౌత్ సినిమాలు ఉన్నట్లు సమాచారం.

# భారీ ధరకు 'మేజర్' ఓవర్సీస్ రైట్స్..!



వరుస విజయాలతో దూకుడుమీదున్న టాలీవుడ్ వర్సటైల్ యాక్టర్ అడవి శేష్ "మేజర్" సినిమాతో బాలీవుడ్ లో అడుగుపెడుతున్న సంగతి తెలిసిందే. ఈ పాన్ ఇండియా చిత్రంలో ఎన్ఎస్జి కమాండో మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ పాత్రలో శేష్ కనిపించనున్నాడు. శశి కిరణ్ తిక్కా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హిందీ తెలుగు మలయాళ భాషల్లో జూలై 2న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కరోనా లాక్ డౌన్ కారణంగా మిగతా సినిమా మాదిరిగానే విడుదల వాయిదా పడింది.సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్న 'మేజర్' సినిమా తెలుగుతో పాటుగా ఇతర భాషల్లో కూడా స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేసింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు - ఫస్ట్ గ్లిమ్స్ - టీజర్ దేశవ్యాప్తంగా విశేష స్పందన తెచ్చుకున్నాయి. ముఖ్యంగా ఈ సినిమా టీజర్ రికార్డ్ స్థాయి వ్యూస్ రాబట్టి అందరి ప్రశంసలు అందుకుంది. దీంతో 'మేజర్' బిజినెస్ వర్గాల్లో 'మేజర్' హాట్ కేక్ లా మారింది. ఈ చిత్రానికి సంబంధించిన థియేట్రికల్ రైట్స్ మరియు ఇతర హక్కులు ఫాన్సీ రేట్లకు అమ్ముడుపోతున్నాయి.'కబీర్ సింగ్' 'కేజీఎఫ్' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలను విదేశాల్లో పంపిణీ చేసిన ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ 'వీకెండ్ సినిమా' వారు "మేజర్" ఓవర్సీస్ రైట్స్ దక్కించుకున్నారు. సదరన్ స్టార్ ఇంటర్నేషనల్ సహకారంతో ఈ చిత్రాన్ని యుఎస్ఎ - కెనడా - ఆస్ట్రేలియా - న్యూజిలాండ్ మరియు సింగపూర్ దేశాలలో మూడు భాషలలో విడుదల చేయనున్నారు. ఈ ఓవర్ సీస్ రైట్స్ భారీ ధరకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.కాగా ముంబైలో జరిగిన 26/11 ఉగ్రవాద దాడుల సమయంలో బందీలను రక్షించి వీరమరణం పొందిన సందీప్ ఉన్నికృష్ణన్ స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని 'మేజర్' చిత్రంలో చూపించబోతున్నారు. దీనికి అడవి శేష్ స్టోరీ - స్క్రీన్ ప్లే అందిస్తుండటం విశేషం. ఇందులో తెలుగమ్మాయి శోభితా దూళిపాళ్ల మరియు బాలీవుడ్ బ్యూటీ సైఈ మంజ్రేకర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రకాష్ రాజ్ - రేవతి - మురళీ శర్మ ఇతర పాత్రలు పోషిస్తున్నారు.శ్రీ చరణ్ పాకాల సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రానికి అబ్బూరి రవి సంభాషణలు రాస్తున్నారు. వంశీ పచ్చిపులుసు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. వినయ్ కుమార్ - పవన్ కళ్యాణ్ ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు. %+వీదీ% ఎంటర్టైన్మెంట్ మరియు %ూాయా% మూవీస్ సహకారంతో సోనీ పిక్చర్స్ ఫిల్మ్స్ ఇండియా "మేజర్" చిత్రాన్ని నిర్మిస్తోంది.

## రవితేజ తో చేయాల్సిన సినిమాని విశ్వక్ తో చేస్తున్నారా..?



'సినిమా చూపిస్తా మావా' 'నేను లోకల్' వంటి సినిమాలతో విజయాలు అందుకున్నాడు దర్శకుడు త్రినాథరావు నక్కిన. ఈ క్రమంలో మాస్ మహారాజా రవితేజ తో ఓ సినిమా చేయడానికి ప్రయత్నాలు చేశారు. రచయిత బెజవాడ ప్రసన్న కుమార్ తో కలసి వర్క్ చేసిన స్క్రిప్ట్ తో రవితేజ ను మెప్పించారని.. ఈ కోర్టు డ్రామాలో ఆయన లాయర్ గా కనిపిస్తారని వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని.. ఇక అధికారిక ప్రకటనే ఆలస్యమని అందరూ అనుకున్నారు. అయితే ఇప్పుడు ఈ సినిమాని రవితేజ తో కాకుండా వేరే హీరోతో చేయనున్నారని టాక్ వినిపిస్తోంది.ప్రస్తుతం 'ఖిలాడీ' చిత్రంలో నటిస్తున్న రవితేజ.. ఇటీవల శరత్ మండవ దర్శకత్వంలో ఓ మూవీని ప్రారంభించారు. దీంతో రవితేజ తో సినిమా లేట్ అవుతుండటంతో.. వరుణ్ తేజ్ కు త్రినాథరావు - ప్రసన్న కుమార్ ఓ కథ వినిపించారని గత రెండు రోజులుగా వార్తలు వస్తున్నాయి. అయితే ఇప్పుడు లేటెస్టుగా మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కు వీరిద్దరూ ఓ కథ చెప్పారని.. దీనికి హీరో సైడ్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చిందని మరో వార్త చక్కర్లు కొడుతోంది. అంతేకాదు రవితేజ తో చేయాల్సిన 'చెట్టుకింద ప్లీడర్' కథతోనే ఇప్పుడు విశ్వక్ ని ఒప్పించారని టాక్ నడుస్తోంది. మరి త్వరలోనే ఈ ప్రాజెక్ట్ విషయంలో క్లారిటీ వస్తుందేమో చూడాలి.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at :SEHASAI PRINTERS, D. 3-88, CHANRA TEATRE, GOSALA MAIN ROAD PENAMALURU MANDAL, DIST KRISHNA , ANDHRAPRADESH.,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16,Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com